
# ఆంధ్రజ్యోతి

**** ఇఫ్తార్ : 6.31 | సహర్ : 5.02 (శనివారం)

ANDHRAJYOTHY



## నల్లగొండ

5 | శుక్రవారం 14 మార్చి 2025


**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | 18004251442 |
| యాదాద్రి | 1800 425 7106 |
| సూర్యాపేట | 1800 425 1972 |

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 60

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.112 | 175 | 200 |
| సూర్యాపేట | రూ.125 | 180 | 210 |
| నల్లగొండ | రూ.125 | 195 | 210 |

ఉష్ణోగ్రత | గరిష్ఠం 35.0 | కనిష్ఠం 20.0

## మానసికంగా బలంగా ఉండాలి

» నిత్య జీవితంలో క్రీడలను అలవాటు చేసుకోవాలి
» పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కలెక్టర్ ఇలాత్రిపాఠి
» ఆటుపోట్లను తట్టుకునేందుకు క్రీడలు దోహదం : ఎస్పీ
» ప్రారంభమైన పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్






పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పోలీసులు శారీరక ధృఢంతోపాటు మానసికంగా ధృఢంగా ఉండాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ను ఆమె ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో చాలెంజింగ్ కేసులను చేధించే పనిలో నిమగ్నమయ్యే పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆ శాఖలో టీమ్ స్పిరిట్ చాలా ముఖ్యమన్నారు. పోలీస్ ఉద్యోగం నిరంతరం ఒత్తిడితోపాటు చాలెంజింగ్ ఉద్యోగమన్నారు. పోలీస్ శాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది నిత్య జీవితంలో క్రీడలను అలవాటు చేసుకోవాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నిత్యం విధులలో ఉండే అధికారులు, సిబ్బంది ఆటుపోట్లు తట్టుకునేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ సబ్ డివిజన్లతోపాటు ఏఆర్ విభాగం జట్టు సుమారు 300మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, షాట్‌పుట్, అథ్లెటిక్స్‌తోపాటు వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. మహిళా విభాగం షాట్‌పుట్‌లో ప్రథమ బహుమతి శివాని(దేవరకొండ), ద్వితీయ బహుమతి సుజాత, తృతీయ బహుమతి రేణుక(నల్లగొండ) గెలుపొందారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, డీటీసీ డీఎస్పీ విఠల్‌రెడ్డి, నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ అంటే.. ఇలా

పోలీస్ అనే ఆంగ్ల పదానికి కలెక్టర్ తనదైన రీతిలో నిర్వచించారు. 'పి' అంటే 'ప్రైజ్ 'ఓ' ఓవర్ అనిటోబ్ 'ఎల్' లైఫ్‌లైన్ కమాండ్ 'ఐ' ఇంటిట్యూష్ 'సి' కాలిక్యూలేటెడ్ 'ఇ' ఎనర్జీ అని నిర్వచనం చెబుతూ ఇవన్నీ ఉన్న వారే పోలీసులని చెప్పారు.

## వ్యవసాయ యాంత్రీకరణకు గ్రీన్ సిగ్నల్




» మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
» తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో 1,552మంది లబ్ధిదారులు

ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు అందుకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతోపాటు బడ్జెట్‌ను ఈనెలలో ప్రవేశపెట్టడానికి ముందే లాంఛనంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని చేపడుతున్నారు. వచ్చే బడ్జెట్‌లో వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో మొదటి విడతగా 1552 మంది రైతులకు రూ.3,59,86,000ను కేటాయించింది. ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించ డం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కొనసాగిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఆరేళ్లుగా నిలిచిపోవడంతో రైతులు ఆధునిక వ్యవసాయం పై దృష్టిసారించే అవకాశాలు లేకుండా పోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగేళ్లపాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని నడిపించింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు నాలుగేళ్లలో సుమారు రూ.50కోట్లను కేటాయించింది. అయితే యాంత్రీకరణ పథకంలో అత్యధికంగా ట్రాక్టర్లను మంజూరు చేశారు. ఈ ట్రాక్టర్లు అధికంగా బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారన్న ఆరోపణలు అప్పట్లో పెద్ద ఎత్తున వెల్లువెత్తడంతో పథకం అబాసుపాలైంది. ఇక కొన్ని పరికరాలను కూడా రాయితీపై ఇచ్చినప్పటికీ రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. పథకం అమలు వివాదాస్పదం కావడంతో అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఆ పథకాన్ని 2018లో అర్ధంతరంగా నిలిపివేసింది. ఆ తరువాత రైతుల నుంచి, రైతు సంఘాల నుంచి పథకం అమలు కోసం డిమాండ్ వచ్చినా, గత ప్రభుత్వం అమలులోకి తేలేదు. దీంతో ఆరేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఊసే లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని పునరుద్ధరించింది. తాజాగా మార్గదర్శకాలు కూడా విడుదల చేసింది.

**నెలాఖరులోగా రాయితీపై యంత్రాలు...**

ఈ సీజన్ ముగిసేలోపు అంటే నెలాఖరున ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని వారికి రాయితీ పై కేటాయించనున్నారు. జిల్లాల వారీగా రైతు ల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణలోకి తీసుకోవడానికి నల్లగొండ, యాదాద్రి భువనగి రి, సూర్యాపేట జిల్లాల వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు సేకరించే పనిలో నిమగ్నమైంది. వ్యవసాయ శాఖ ముందే తుమ్మల నాగేశ్వర్‌రావు కొన్ని రోజుల క్రితం రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శితోపాటు డైరెక్టర్, ఇతర వ్యవసాయ అధికారులతో సమీక్ష కూడా నిర్వహించారు. రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, యంత్ర పరికరాల జాబితాను కూడా రూపొందించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రోటవేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు...

- మిగతా 7వ పేజీలో...




## రేపటి నుంచి ఒంటిపూట బడులు

» ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు » వచ్చే నెల 23 వరకు కొనసాగింపు



7

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి ఒంటి పూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం నాడు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు ఈనెల 15నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పనిచేస్తాయి.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

## నేడు రంగుల మహో(ళీ)త్సవం



6

హోళీ హోళీల రంగ హోళీ చమ్మకేళీల హోళీ... వరుస లేని కాముడమ్మ హోళీ చమ్మకేళీల హోళీ.. వంటి పల్లె పాటలు, కోలాటాలు, చప్పట్లతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. కుల, మత, వర్గ బేధాలు వీడి, పేద, ధనిక, చిన్నా, పెద్ద అనే తారతమ్యాలను మరిచి అందరూ కలిసి ఆనందంగా జరుపుకునేది హోళీ పండుగ. హోళీ ఆడేటప్పుడు కలిగే ఆనందం మరింత జ్ఞాపకంగా ఉండాలంటే సహజ రంగులు చల్లుకోవాలని, రసాయన రంగులు చల్లుకుని ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పాడు చేయవద్దని డాక్టర్లు, పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)

## యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను అందంగా ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు.



7

ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు

## శిశు మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

**కలెక్టర్ ఇలాత్రిపాఠి**

నల్లగొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): శిశు మరణాలు లేని జిల్లాగా నల్లగొండను తీర్చిదిద్దాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల ఉదయాదిత్య భవన్‌లో మిర్యాలగూడ డివిజన్ పరిధిలో శిశు మరణాలపై గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రసవానంతరం వివిధ కారణాల వల్ల శిశువులు చనిపోవడాన్ని తగ్గించాలని, ఇందుకు వైద్య, శిశు సంక్షేమశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. అవగాహన లోపం, మూఢనమ్మకాలు, సకాలంలో వైద్యం అందకపోవడం తదితర కారణాలతో శిశువులు మృతి చెందుతుండడం బాధాకరమన్నారు. గర్భిణీకి పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వల్ల శిశు మరణాలు తగ్గుతాయని అన్నారు. డాక్టర్లు ప్రతీ నెలా వారి పరిధిలో ఆశా, ఏఎన్ఎంలతో సమావేశం ఏర్పాటు చేసి శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ మాతృనాయక్, డాక్టర్ వసుంధర, డాక్టర్ స్వరూప, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

**ప్రత్యేక ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి**

వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సోమవారం నిర్వహించే ప్రజావాణికి వచ్చే వయోవృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడకూడదన్న దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో 49మంది వయోవృద్ధులు, దివ్యాంగులు హాజరై తమ సమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. సంబంధిత శాఖల అధికారులను తన వద్దకు పిలిపించుకొని ఫిర్యాదులను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణఅమిత్, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

**బయోచార్‌పై అవగాహన కల్పించాలి**

కట్టంగూరు: పంట వ్యర్థాలతో జీవబొగ్గు(బయోచార్)ను ఉత్పత్తి చేసి పొలంలో వేస్తే కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కట్టంగూరు మండలం చెర్వుఅన్నారంలో పంట వ్యర్థాలతో తయారు చేస్తున్న బయోచార్ ప్యాక్టరీని గురువారం ఆమె సందర్శించి మాట్లాడారు. బయోచార్ అనేది పంట వ్యర్థాల సహజ వనరుల ద్వారా వచ్చేది. దీని ద్వారా నాణ్యమైన పంటలు పండించడం, మట్టి నాణ్యత పెంచడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆక్సిజన్ లేకుండా పత్తి కట్టెలను, వరి గడ్డిని, అలాగే ఇతర పంట వ్యర్థాలను వేడి చేసి కట్టెలో సేంద్రియ కర్బనం నిల్వ చేయడం ద్వారా బయోచార్ అనేది తయారవుతుందని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కాలుష్యం పెరగడమే కాకుం డా, ప్రజలు అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ పంట పొలాల వ్యర్థాల సేకరణ, తదితర వివరాలన్నింటిని సంస్థ ప్రతినిధుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.

**సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ఆదాయం**

సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాలు ఆదాయాన్ని సృష్టించుకోవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కట్టంగూరు మండలంలోని అయిటిపాములలో ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థికసాయంతో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్వచ్ఛశక్తి సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఉత్పత్తి చేస్తున్న సోలార్ విద్యుత్ ఉత్పత్తి, ఆదాయం, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అయిటిపాముల గ్రామంలో సుమారు 50 గృహాల్లో సోలార్ విద్యుత్ అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిపై పండ్లు, పూలు మొక్కలు పెంపకానికి నర్సరీలు స్థలాన్ని ఏర్పాటు కేటాయించాలని నర్సింహారెడ్డి కోరగా అవసరమైన స్థలాన్ని చూడాలని ఆమె తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వరరావు, కట్టంగూరు రైతు ఉత్పత్తుల సమాఖ్య అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సింహారెడ్డి, ఆర్‌డీఓ వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ మధు, వ్యవసాయ అధికారులు, స్వచ్ఛశక్తి కేంద్రం ప్రతినిధి సుదాకర్ ఉన్నారు.

### కంటి వ్యాధులపై అవగాహన

## కలిగి ఉండాలి

**డీఎంహెచ్‌వో శ్రీనివాస్**



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

నల్లగొండ టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే సూక్తిని పాటించాలని ప్రతి ఒక్కరూ కంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ గ్లోకోమా వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో కంటి సంబంధిత వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్లోకోమా అనేది నిశ్శబ్దంగా మనిషిలో అంధత్వాన్ని కలిగిస్తుందని, వెంటనే గుర్తిస్తే అంధత్వం నుంచి బయటపడవచ్చని అన్నారు. 40ఏళ్ల పైబడిన వారు తరుచూ కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుటుంబంలో ఎవరికైనా గ్లోకోమా ఉంటే కుటుంబసభ్యులు గ్లోకోమా టెస్టులు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్, కంటి డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ, ఎన్‌పీసీబీ డాక్టర్ సువర్ణ, మహేంద్ర, హెచ్‌వోడీ డాక్టర్ సాంబశివరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్, కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

**టీబీ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి**

దామరచర్ల: టీబీ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని స్థానిక సిమెంట్ పరిశ్రమలో గురువారం నిర్వహించిన జాతీయ టీబీ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. టీబీకి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మందులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి కళ్యాణ్‌చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో గీతావాణి, వేణుగోపాల్‌రెడ్డి, కేస రవి, మండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని

## పెంపొందించాలి

**ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర ఈడీ మధుసూదన్‌రెడ్డి**



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ సభ్యులు

చిట్యాలరూరల్, చిట్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ఈడీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లోని ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎస్‌సీఈఆర్‌టీ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం ప్రతిభను పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచితే వారు సత్ఫలితాలను సాధిస్తారని, వినడం, రాయడం చదవడం విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలు బోధించిన తర్వాత విద్యార్థులతో పాఠ్యపుస్తకాలు అధ్యయనం చేయించాలన్నారు. వారి వెంట యాసీన్‌మహ్మద్, సీఆర్‌పీ జయకాంత్, రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయురాలు మాధవీజానకి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జగదీ‌ష్‌రెడ్డి సస్పెన్షన్ అనైతికం

● నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



క్లాక్‌టవర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

నల్లగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అసెంబ్లీ వేదికగా గొంతెత్తిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జగదీ‌ష్‌రెడ్డి సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా గురువారం జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్లో బీఆర్ఎస్‌నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ జగదీ‌ష్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలన్నారు. సభలో జగదీ‌ష్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడు కాంగ్రెస్ సభ్యులు పదేపదే అడ్డు తగులుతున్నా సభాపతి వారిని నియంత్రించలేక పోయారన్నారు. ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజల సమస్యలను అధ్యయనం చేసి సభ దృష్టికి ప్రజా సమస్యలు పరిష్కారానికి వేదిక కావాలని కేసీఆర్ దిశానిర్దేశం చేశారన్నారు. రైతు రుణమాఫీ గురించి, ఎండిపోతున్న పంటల గురించి, రైతుబంధు గురించి లేవనెత్తిన అంశాలను జీర్ణించుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం జగదీష్‌రెడ్డి గొంతు నొక్కిందని విమర్శించారు. పథకం ప్రకారం అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేశారని, ఇది కుట్రపూరితమైన చర్య అన్నారు. జగదీ‌ష్ రెడ్డి మాట్లాడుతున్న క్రమంలో అనలు కులం ప్రస్తావన రాలేదన్నారు. జగదీష్‌రెడ్డి మాట్లాడిన విషయంపై స్పష్టత ఇవ్వడానికి కూడా అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇలాంటి సస్పెన్షన్లతో ప్రజా ఉద్యమాలను, ప్రజా గొంతుకలను నిలువరించలేరన్నారు. ఆందోళన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, అయితగోని యాదయ్య, కొండూరు సత్యనారాయణ, కటికం సాత్విక్, మారగోని గణేష్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మరబోయిన నాగార్జున తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నిరసన నేపథ్యంలో ఎస్‌బీ శంకర్, సైదులు, జయశంకర్, మానస, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటుకు పర్యవేక్షించారు.

### హోలీని ప్రశాంతంగా

## నిర్వహించుకోవాలి

**ఎస్పీ శరత్‌చంద్ర పవార్**



నల్లగొండ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, చట్టానికి వ్యతిరేక వ్యవహరిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఇతరులకు హాని కలిగించకుండా వేడుకలను నిర్వహించుకోవాలని, ప్రజలు, యువత, అన్ని వర్గాల వారు కలిసి మెలిసి చేసుకోవాలని సూచించారు. మహిళలపై ఈవ్ టీజింగ్ వంటి ఆకతాయిలపై నిరంతరం షీ టీం నిఘా ఉంటుందని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హోలీ అనంతరం నీటి ప్రవాహం ఉన్న చోటుకి, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# నేడు రంగుల మహో(ళీ)త్సవం



ఉత్సాహంగా పిల్లలు, పెద్దలు అందరూ కలిసి నేడు ఆనందంగా జరుపుకునే పండుగ హోలీ. ప్రాచీనమైన పండుగల్లో ఇది ఒకటి. గ్రీష్మరుతువు ఆరంభంలో, వసంత రుతువు చివర్లో పాల్గుణ మాసం పౌర్ణమి రోజు కాముడిని దహనం చేసి మరుసటి రోజున రంగులు చల్లుకుంటూ హోలీని జరుపుకుంటారు. ఈ నెల 13వ తేదీ రాత్రి కాముడి దహనం నుంచే ఆటపాటలతో వేడుకలు ఘనం గా మొదలయ్యాయి. శివపార్వతుల ప్రేమకు కామంతో అడ్డంకి గా మారిన కామ దేవుడికి బుద్ధి చెప్పేలా ప్రారంభమైన కామ దహనాన్ని గురువారం రాత్రి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఉత్సాహంగా నిర్వహించారు. యువకులు జట్లుగా ఇంటింటికి వెళ్లి పాత వస్తువులను సేకరించి కూడళ్లలో పేర్చి దహనం చేశారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్/మోత్కూరు(భువనగిరి టౌన్)

సహజ రంగులతో హోలీ ఆడితే ప్రమాదం ఉండదు. రసాయనిక రంగులతో అనర్థాలు ఏర్పడతాయి. ప్రకృతిలో లభించే ఆకులు, పూలరెక్కలతో తయారుచేసిన రంగులతో హోలీ ఆడితే చర్మం దెబ్బ తినదు. రుతువులు మారిన కారణంగా బ్యాక్టీరియా, వైరస్, విషజ్వరాలను అదుపులో పెట్టుకోవటానికి పసుపు నీటిని పూర్వం చల్లుకునేవారు. ఎలాంటి ప్రభావం చూపని పువ్వుల సువాసనను, కూరగాయల తియ్యదనాన్ని ఆస్వాదిస్తూ హోలీని ఆడుకోవచ్చు. హోలీని హెర్బల్ రంగులతో ఆడి ఆనందంగా జరుపుకుని పర్యావరణాన్ని కాపాడాలని కొందరు పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.

**కృత్రిమంతో వ్యాధులే..**

కృత్రిమ రంగుల్లోని లెడ్, అల్యూమినియం, బ్రోమైట్, మెర్క్యూరిక్‌సల్ఫేట్ క్యాన్సర్ వ్యాధులను సంక్రమింపజేసే ప్రమాదముంది. గులాబీ రంగు



లోని రొడమిన్‌బీ చర్మ వ్యాధులను, పర్పుల్ రంగులోని క్రోమియం అయోడైడ్ ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులకు, ఆస్తమా రోగాలకు దారితీస్తుందంటున్నారు. ఇతర రసాయనాలతో జుట్టు ఊడటం, చర్మ వ్యాధులు రావడం జరుగుతుందంటున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు...**

రంగులు చల్లుకునేటప్పుడు నోట్లో, కళ్లలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నెత్తిపైన కోడిగుడ్లు కొట్టడం వంటి చర్యలతో మెదడు అదరడం, పెంకులు గుచ్చుకోవడం జరగవచ్చు. రంగులు చల్లుకునేటప్పుడు శరీరమంతా కప్పి ఉండేలా కాటన్ దుస్తులు వేసుకోవాలి. రంగులు చల్లుకోవడానికి వెళ్లే ముందు శరీరానికి కొబ్బరినూనె, ఆలివ్‌ఆయిల్ గాని రాసుకుంటే రంగులు శరీరానికి అంటకుండా ఉంటాయి. రంగులు చల్లుకోవడం పూర్తయ్యాక వేడి నీటితో తల స్నానం చేయాలి.



**మోదుగ పూల సౌందర్యం...**

హోలీ పండుగ అంటేనే గుర్తొచ్చేది మోదుగ వృక్షం. ఒకప్పుడు ఈ పూలతోనే ఎక్కువగా రంగులు తయారు చేసుకుని వేడుకల్లో చల్లుకునేవారు. వేసవికి ముందు రహదారుల వెంట పంట క్షేత్రాల్లో మోదుగు చెట్లు పూలతో ఆకట్టుకుంటున్నాయి. కేతేపల్లి, శాలిగౌరం మండలాల్లో రహదారుల వెంట మోదుల పూలతో చెట్లు.



## శ్రీరామలింగేశ్వర స్వామి కల్యాణం నేడు



(ఆంధ్రజ్యోతి-మోత్కూరు): హోలీ పండుగ రోజు నుంచి యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ప్రతి ఏటా కాముని దహనం జరిగిన తెల్లవారి శ్రీ రామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం జరిగిన ఐదు రోజులకు 'అగ్ని గుండాలు' జరుగుతాయి. శ్రీ రామచంద్రుడు ఇక్కడి ఆలయంలోని శివలింగానికి పూజ చేసి వెళ్లాడని అందుకే ఈ ఆలయానికి పేరొచ్చిందని చెబుతారు.

**ఆలయం ముస్తాబు...**

స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులు వేయించి, విద్యుద్దీపాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. లౌడ్‌స్పీకర్లు అమర్చి వేడుకలకు సిద్ధం చేశారు. శుక్రవారం(ఈ నెల 14న) ఉదయం 5గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేశారు. ఈ నెల 15న రాత్రి గరుడ సేవ, 17న రాత్రి రథోత్సవం, 19న రాత్రి స్వామివారిని పట్టణంలో ఊరేగింపు, 20న సూర్యుడు ఉదయిస్తున్న సమయాన 'అగ్నిగుండాలు' నిర్వహిస్తారు. 21న రాత్రి జరిగే దోపోత్సవంతో స్వామివారి కల్యాణోత్సవాలు ముగుస్తాయి. కల్యాణోత్సవం, అగ్నిగుండాలను తిలకించడానికి చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు.

## హోలీ వేడుకలకు 'ముప్పారం' దూరం



శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం.(ఫైల్)

(ఆంధ్రజ్యోతి-నిడమనూరు): దేశమంతా హోలీ సంబరాల్లో ఉండే ఆ ఆనందాలు, సరదాలకు నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ముప్పారం గ్రామం దూరంగా ఉంటుంది. ఇది ఏళ్ల తరబడిగా ఆనవాయితీగా వస్తోంది. రోజంతా శాలివాహనుల కాలంలో నిర్మించిన 903 ఏళ్ల చరిత్ర కలిగి ఉన్న గ్రామంలోని పురాతన అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మునిగిపోతారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తారు. వారం పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో తిరుకల్యాణం ప్రతి ఏటా హోలీ పండుగ రోజునే చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఉత్సవాల్లో ఉండే ప్రజలు హోలీ వేడుకలకు దూరంగా ఉంటారు. దీనికితోడు ఈ ఏడాది గ్రామంలో కనకదుర్గ, ముత్యాలమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నేటి నుంచి జరుగుతున్నాయి. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

**సల్కునూరులోనూ..**

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం సల్కునూరు గ్రామస్థులు హోలీ రోజు వేడుకలకు దూరంగా ఉంటారు. గ్రామంలోని శ్రీస్వయంభూ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ప్రతి ఏడాది 10రోజులపాటు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజున నిర్వహించే గ్రామోత్సవం(డేగాట)లో గ్రామస్థులు ఉత్సవమూర్తులతో ఊరేగింపుగా కూడలికి చేరుకుంటారు. అక్కడ స్వామివారు, అమ్మవారు వైపు రెండు గ్రూపులుగా విడిపోయి వసంతోత్సవాన్ని ఆడుతారు. అనంతరం గ్రామస్థులు హోలీ వేడుకలను నిర్వహిస్తారు. ఈ నెల 19న గ్రామోత్సవంతో పాటు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటామని గ్రామస్థుడు తమ్మడబోయిన రమేష్ తెలిపారు. - (ఆంధ్రజ్యోతి-వేములపల్లి)



గత ఏడాది డేగాట(వసంతోత్సవం) ఆడుతున్న గ్రామస్థులు (ఫైల్)

## నకిరేకల్ పోలీసుల అదుపులో సైబర్ నేరగాడు

నకిరేకల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు న్యూడ్ వీడియోకాల్ చేసిన సైబర్ నేరగాళ్లను నకిరేకల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ నెల 4వ తేదీ రాత్రి మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మహిళా నగ్న వీడియోను పోస్టు చేశారు. ఈ ఉదంతంపై ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నకిరేకల్ సీఐ రాజశేఖర్‌తో పాటు పోలీసుల బృందం ఈ నెల 6వ తేదీన మధ్యప్రదేశ్‌కు వెళ్లి సైబర్ నేరగాన్ని ఒకరిని అదుపులోకి తీసుకుని నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌కు ఈ నెల 10వ తేదీన తీసుకువచ్చింది. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాలతో విచారణ వేగవంతం చేస్తున్నారు. సైబర్ నేరగాన్ని జిల్లా సైబర్ క్రైం సిబ్బందికి నకిరేకల్ పోలీసులు అప్పగించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ధార్ జిల్లాలో సైబర్ నేరగాన్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ కేసులో భాగస్వాములైన మిగతా వారిని పట్టుకునేందుకు నకిరేకల్ పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

## రూ.20 లక్షల గంజాయి స్వాధీనం

చౌటుప్పల్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణకేంద్రంలో 46 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ ఏజెన్సీ నుంచి బెంగుళూరుకు కారులో గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో భువనగిరి ఎస్‌వోటీ పోలీసులు గురువారం రాత్రి మాటువేశారు. పట్టణ కేంద్రంలోని గణేశ్‌నగర్ సర్వీస్ రోడ్డులో కారులో వెళ్తుండగా వెంబడించి పట్టుకున్నారు. గంజాయి స్మగ్లర్ పోలీసుల కళ్లు కప్పి కారును వదిలేసి పరారయ్యాడు. 46 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.20లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

## వ్యక్తి అదృశ్యం



వినయ్

మిర్యాలగూడ అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన వ్యక్తి బుర్రి వినయ్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఇంటినుంచి బయటకు వెళ్లిన వినయ్ తిరిగి రాలేదు. యువకుడి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఆచూకీ తెలుసుకునేందుకు బంధువుల ఊళ్లలో ఆరాతీశారని, ఆచూకీ లభ్యం కావడంతో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదృశ్యమైన యువకుడు వినయ్ సుమారు 5.4 అంగుళాల ఎత్తు, ఛామనఛాయరంగు ఉంటాడని భార్య రీనారాణి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని యువకుడి ఆనవాళ్లు తెలిసిన వారు 8712670189, 87126715151 నెంబర్లకు సమాచారమివ్వాలని ఎస్ఐ కోరారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు మృతి



ముత్యాలబాబు(ఫైల్)

అర్వపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలకేంద్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ముత్యాల బాబు(93) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముత్యాలబాబు తెలంగాణ సాయుధపోరాటంలో బీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యంలకు కుడిభుజంగా ఉండి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఎర్రజెండా బాటలో ఉద్యమాలు చేశారు. ముత్యాలబాబు మృతదేహంపై మాజీ జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, వజ్జె శ్రీను, పులుసు సత్యం, చెరుకు యాకలక్ష్మి, యాదగిరి, కనుకు శ్రీనివాస్, బైరబోయిన మహారాజు, రామలింగయ్య, ముత్యాల బాలరాజు, బాలకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## కారులో నుంచి రూ. 2.5లక్షల నగదు చోరీ

నేరేడుచర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని కారులో ఉంచిన రూ.2.5 లక్షల నగదు చోరీకి గురైంది. బాధితుడు గంగోత్రి ఆసుపత్రి మేనేజింగ్ డైరక్టర్ కనకపూడి మహేష్ తెలిపిన ప్రకారం ఉదయం 8.50 గంటలకు ఖమ్మంలోని ఓ బ్యాంకులో నగదు వేసేందుకు కారులో రూ.3లక్షల నగదు బ్యాగులో పెట్టి అందులో ఉంచారు. పని ఉండడంతో కారును రోడ్డుపైనే నిలిపి ఆసుపత్రికి వెళ్లి ఐదు నిముషాల వ్యవధిలో తిరిగి కారు వద్దకు చేరుకున్నట్లు తెలిపారు. కారులో ఉంచిన నగదును చూసుకోకుండా ఖమ్మం వెళ్లి బ్యాంకు వద్ద చూసుకోగా అందులో రూ.2.5 లక్షల నగదు పోయినట్లు గుర్తించాడు. కేవలం రూ.50వేలు మాత్రమే బ్యాగులో ఉండడంతో ఎవరో దొంగిలించి ఉంటారని గుర్తించినట్లు తెలిపారు. నగదు పోయిన ఘటనపై నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## ఐదుగురు జూదరుల అరెస్టు

అనంతగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పేకాటఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట జిల్లా అనంతగిరి ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఖానాపురం గ్రామశివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో వెళ్లగా పేకాడుతున్న గ్రామానికి చెందిన ఐదుగురు పట్టుకొని వారి వద్ద నుంచి రూ.1430 నగదు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ట్యాంకర్ ఢీకొని ఎనిమిది గొర్రెలు మృతి

పాలకవీడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రంలో గొర్రెల మందపైకి గురువారం అతివేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొనడంతో ఎనిమిది గొర్రెలు మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మల్లిరెడ్డి అంజిరెడ్డి కొంతకాలంగా గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం గొర్రెలను మేపడానికి రహదారి మీదుగా వెళ్తుండగా నేరేడుచర్ల నుంచి జాన్‌పహాడ్ వెళ్తున్న ట్యాంకర్ వెనుక నుంచి గొర్రెల మందపైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఎనిమిది గొర్రెలు మృత్యువాత పడగా 3 గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో రూ.లక్ష నష్టం వాటిల్లిందని యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపారు. పట్టణంలోని లోటస్ టెంపుల్ సమీపంలో హైదరాబాద్‌కు చెందిన విజయ్ ఎలాంటి అనుమతులు లేకుండా జిలెటిన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్‌లకు పాల్పడ్డాడు. దీంతో వ్యక్తిని అరెస్టు చేసి 350 జిలెటిన్‌స్టిక్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



సైదులు మృతదేహం

మిర్యాలగూడ అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్‌లో గురువారం జరిగింది. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం నేరేడుచర్ల మండలం బక్కయ్య గూడెం గ్రామానికి చెందిన మారేపల్లి సైదులు(60) శ్రీనివాసనగర్ సమీపంలోని కేఎస్‌పీ ఫంక్షన్ హాల్‌లో బంధువుల వివాహానికి హాజరయ్యాడు. అనంతరం మిర్యాలగూడకు వెళ్లేందుకు కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిని దాటుతుండగా, అదే సమయంలో తుంగపాడు నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న టీఎస్05 ఈవై0765 నెంబరుగల బైక్ ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ సైదులును అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా, పరిస్థితి విషమించడంతో నల్లగొండజిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. సైదులు కుమార్తె నాగమణి ఫిర్యాదుమేరకు బైక్ యజమాని ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అచ్చయ్య తెలిపారు.

**తల్లి చికిత్స కోసం వెళ్లి...**

మునుగోడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మునుగోడు శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన వివాహిత చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం మునుగోడు మండలంలోని కచలాపురం గ్రామానికి చెందిన జంగా సుజాత(42) అనారోగ్యానికి గురైన మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన తల్లి తోటకూరి యాదమ్మకు వైద్యం చేయించేందుకు వెళ్లింది. అనంతరం మునుగోడు నుంచి మట్టిపల్లి నితిన్ బైక్‌పై తిరిగి వస్తుంది. స్థానికంగా ఉన్న ఓ పత్తి మిల్లు సమీపంలో గేదె అడ్డురావటంతో ప్రమాదం జరిగింది. బైక్‌పై వెనుక కూరున్న తల్లీకుమార్తెలకు గాయాలయ్యాయి. కుమార్తె సుజాతకు తలకు బలమైన గాయమై కావడంతో స్థానికులు, బంధువుల సాయంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు సుజాత భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గంటసేపు క్యాబిన్‌లో విలవిల



క్యాబిన్‌ను తొలగిస్తున్న క్రేన్, చికిత్స పొందుతున్న డ్రైవర్ వర్మ

హుజూర్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : లారీని వెనక నుంచి టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో టిప్పర్ డ్రైవర్ క్యాబిన్‌లో చిక్కుకుని విలవిల్లాడాడు. గంటసేపు ఆయన రోదనలు అందరినీ కదిలించాయి. కాగా డ్రైవర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిలుకూరు మండలం కొండాపురం శివారులోని గుట్ట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ హుజూర్‌నగర్‌లోని హరికృష్ణ ఆసుపత్రి సెంటర్‌లో ముందుగా వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో టిప్పర్ డ్రైవర్ కొండా వర్మ తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో చిక్కుకుపోయాడు. కాపాడాలని రోదిస్తూ కేకలు వేశాడు. గమనించిన స్థానికులు అందుబాటులో ఉన్న క్రేన్ సహాయంతో డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకుతీశారు. ఇందుకోసం సుమారు గంటపాటు శ్రమించారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. కాగా సంఘటనకు సంబంధించి ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

## దేవాలయ భూముల్లో చెట్లు నరికేస్తే చర్యలు

చిట్యాల రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన భూముల్లో చెట్ల నరికివేతపై కేసు నమోదు చేసినట్లు అటవీ శాఖ అధికారి మల్లారెడ్డి తెలిపారు. అఖిలపక్ష నాయకులు బుస్సు నర్సింహ, కోయగూర నర్సింహ, బొడిగె లక్ష్మయ్య, చెరుకుపల్లి సాయిలు, బత్తుల నర్సింహ, పెద్దగోని అంజన్‌కుమార్ ఫిర్యాదు మేరకు గురువారం బీట్ అధికారి మామిడి నర్సింహులుతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దేవాలయం గుట్ట వెనుకభాగంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఏళ్ళుగా ఉన్న చెట్లను నరికివేసినట్లు గుర్తించినట్లు మల్లారెడ్డి తెలిపారు. చెట్లను నరికివేసిన గుండ్రాంపల్లికి చెందిన అచ్చిన అంజయ్యపై కేసునమోదు చేసినట్లుగా తెలిపారు. దేవాదాయ శాఖలోనైనా, అటవీ భూముల్లోనైనా ఎలాంటి అనుమతుల్లేకుండా చెట్లను నరకకూడదన్నారు. అది నేరమని, ఎవరైనా అనుమతుల్లేకుండా ఇష్టారాజ్యంగా చెట్లను నరికితే ఫిర్యాదు చేయాలన్నారు. ఇదిలా ఉండగా దేవాలయానికి సంబంధించి భూమిలో చెట్లను ఆలయ కమిటీ చైర్మన్ సూచన మేరకే నరికేయాలని సూచించారని పలువురు గ్రామస్థులు ఆరోపించారు. ఈ విషయంపై ఆలయ కమిటీ చైర్మన్ బండ లింగస్వామిని సంప్రదించగా చెట్ల నరికివేతపై తమకు ఎలాంటి సంబంధంలేదని, చెట్ల నరికివేతపై తహసీల్దార్‌కు, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



చెట్లు నరికివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మల్లారెడ్డి

## నిబంధనలు పాటించాలి

**జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్**



భువనగిరి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జైలు నిర్వహణలో నిబంధనలను తూ.చా. తప్పకుండా పాటించాలని జైళ్లశాఖ డీఐజీ డాక్టర్ డీ శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం భువనగిరి సబ్‌జైల్‌ను ఆయన తనిఖీచేశారు. జైలులో వసతులను, భోజనం నాణ్యతను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి జైలు నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. రికార్డుల ఆధారంగా సమీక్షించారు. జైలు నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా 25 మంది రిమాండ్ ఖైదీల సామర్థ్యం ఉన్నట్లు స్థానిక జైలు అధికారులు ఆయనకు వివరించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ జే నెహ్రూ పాల్గొన్నారు.

## దాడి చేసిన వ్యక్తికి ఏడాది జైలు

**రూ.5వేల జరిమానా**

భువనగిరి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : భూతగాదా విషయంలో దాడి చేసిన వ్యక్తికి కోర్టు ఏడాది జైలుతో పాటు రూ.5 వేలు జరిమానా విధించింది. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వీ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి చెందిన జిట్టా శ్రీనివాస్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన వనం రమేష్, అతడి సోదరుడు వనం సుమన్ 2020 మే 18న భూతగాదా విషయంలో దాడి చేశారు. ఘటనపై ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఎస్ఐ శంకరయ్య విచారణ చేసి వనం రమేష్, సుమన్‌పై కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. కేసు విచారణలో ఉండగా వనం సుమన్ అనారోగ్య సమస్యలతో 2022లో చనిపోయారు. అయితే ఈ కేసు వాదోపవాదాల అనంతరం రమేష్‌కు ఏడాది జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ భువనగిరి అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఉషా శ్రీ గురువారం తీర్పు ఇచ్చినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ కేసు విచారణలో సహకరించిన భువనగిరిరూరల్ కానిస్టేబుల్ నాగరాజు, అదనపు పీపీలు సత్యనారాయణ, వరలక్ష్మిలను ఆయన అభినందించారు.

## జాతీయస్థాయి క్విజ్ పోటీల్లో పేట విద్యార్థుల ప్రతిభ

● రాష్ట్ర స్థాయిలో విజేతలుగా... జాతీయ స్థాయిలో నాలుగో స్థానం

● తేజ విద్యార్థుల ఘనత



తేజ పాఠశాల విద్యార్థులు హృతిక్, నవీన్

కోదాడ రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపారు. కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ, భారతీయ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఫిట్ ఇండియా ఫైనల్ పోటీల్లో దేశవ్యాప్తంగా రాష్ట్రస్థాయిలో విజేతలైన 32జట్లు ఈ పాల్గొన్నాయి. తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు పల్లా హృతిక్, కొండ్రు నవీన్‌కుమార్ తెలంగాణ రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచి, జాతీయస్థాయిలో 4వ స్థానంలో నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ ఉస్తెల రమాదేవి తెలిపారు. విద్యార్థులు రూ.5 లక్షల నగదు బహుమతులు అందుకోనున్నట్లు ఆమె తెలిపారు.

## వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతి



నర్సమ్మ

రాజాపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం సింగారం గ్రామంలో ఉపాధి హామీ కూలీ వడదెబ్బతో మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగారం గ్రామానికి చెందిన బొల్లారం నర్సమ్మ (55) గురువారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చి అస్వస్థతకు గురవటంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

## నీరాకేఫ్ అప్పగింత నిర్ణయం సముచితం

నల్లగొండరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ పరిధిలోని నీరాకేఫ్‌లను కల్లుగీత ఆర్థిక సహకార సంస్థకు బదిలీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సముచితమని కల్లుగీత కార్మిక సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొండ వెంకన్న, చౌగోని సీతరాములు స్వాగతించి, హర్షం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్థానిక తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నెక్లెస్ రోడ్డులోని నీరాకేఫ్ టూరిజం శాఖ భవనం, ఆస్తులను తెలంగాణ కల్లుగీత ఆర్థిక ఆర్థిక సహకార సంస్థకు బదిలీ చేయడం, ఇరుశాఖల మంత్రులు ఒప్పందాలపై సంతకాలు చేయడం మంచి నిర్ణయమన్నారు. 2023 నుంచి కల్లుగీత కార్మిక, ఇతర సంఘాలు చేస్తున్న ఫలితంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వారు గుర్తు చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి జూపల్లి కృష్ణారావులకు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ తరుపున కృతజ్ఞతలు వారు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, సీతారాములు

# రేపటి నుంచి ఒంటిపూట బడులు

నల్లగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి ఒంటి పూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాలలో ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఈనెల 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మ ధ్యాహ్నం 12.30గంటల వరకు పనిచేస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు 12.30గంటలకు మధ్యాహ్న భోజనం అందించిన అనంతరం వారిని ఇంటికి పంపుతారు. మూడు జిల్లాల్లోనూఎండల తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో ఒంటిపూట బడుల వల్ల విద్యార్థులు వేసవి తీవ్రత నుంచి గట్టెక్కనున్నారు. ఇక పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సమాయత్తం చేయడం కోసం యథావిధిగా ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 4,381 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉండగా ఇందులో ప్రభు త్వ పాఠశాలలు 3,123, ప్రైవేట్ పాఠశాలలు 1,258 ఉన్నాయి. ఎస్ఎస్‌సీ పరీక్ష కేంద్రం ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం ఒంటి గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేసేలా ఆదేశాలు ఇచ్చారు. 2024-25 విద్యా సంవత్సరంలో చివరి రోజు ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగనున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అన్ని యజమాన్యాలు అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసి ంది. ఎక్కడైనా ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ఒంటిపూట బడులు నిర్వహించకపోతే జిల్లా విద్యా శాఖ అధికారులు ఆయా పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంజీయూ వేదిక కావాలి

నల్లగొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ క్రీడా ప్రాంగణాలు వేదికలు కావాలని ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ హరీష్ కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనా బాలాదేవిని ఎంజీయూ బృందం కలిసి నివేదించింది. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలోని క్రీడా ప్రాంగణాలను రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్లు అభివృద్ధి చేసిన దృష్ట్యా, మున్ముందు చలో ఇండియా అలాంటి జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యక్ష పరిశీలనకు ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సోమలింగం, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రామావత్ మురళి తదితరులు పాల్గొన్నారు.

అంగవైకల్యం తమ ప్రతిభకు అడ్డు కాదని ఓ యువకుడు నిరూపించగా, అంగవైకల్యం స్వయం 'ఉపాధి'కి అవరోధం కాదని మరో యువకుడు అడుగు ముందుకు వేశారు. విధి రాతను ఎదిరించి ఆదర్శంగా నిలిచారు. ఆ దివ్యాంగ యువకులే నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మాటూరు గ్రామానికి చెందిన వస్త్రంనాయక్, సూర్యాపేట జిల్లా కేంద్రానికి దిగిన యాదగిరి. నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన వస్త్రంనాయక్ బాల్యంలోనే తల్లిని కోల్పోయాడు. ఈ తర్వాత జరిగిన ప్రమాదంలో చేతి వేళ్లనూ కోల్పోయాడు. అయినా క్రికెట్‌పై మక్కువతో మెలకువల నేర్చుకుని దివ్యాంగుల జాతీయ క్రికెట్ జట్టులో స్థానం సాధించాడు. యాదగిరిని చిన్నతనంలో రెండు కాళ్ల చచ్చుబడ్డాయి. అయినా నిరాశ చెందకుండా స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

(ఆంధ్రజ్యోతి-త్రిపురారం)




నేపాల్‌లో జరిగిన మ్యాచ్‌లో జట్టుతో వస్త్రంనాయక్

# నాయక్

## ఓ ఆల్‌రౌండర్

నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం మాటూరు గ్రామానికి చెందిన ధనావత్ రాము, బుల్లి దంపతులకు ముగ్గురు సంతానం. చివరి వాడు వస్త్రంనాయక్. అతడికి మూడేళ్ల వయస్సులోనే ఉన్నపుడు తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. పిల్లలను పోషించడానికి తండ్రి కూలిపనుల కోసం పలు ప్రాంతాలకు వలసవెళ్లేవాడు. వస్త్రంనాయక్ ఆరేళ్ల వయసులో తండ్రి వెంట గుంటూరు ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ పనిచేసే ప్రాంతంలో పత్తి యంత్రంలో చేయి పడటంతో ఎడమ చేతి అన్ని వేళ్లనూ కోల్పోయాడు. కొద్ది రోజుల్లో కోలుకుని విద్యాభ్యాసం కొనసాగించాడు..ఒకటినుంచి ఏడో తరగతి వరకు మాటూరు, ప్రభుత్వ పాఠశాల, 8నుంచి 10వ తరగి వరకు పానగల్, ఇంటర్, డిగ్రీ నల్లగొండలో చదివాడు.

**క్రికెట్‌పై మక్కువతో..**

చిన్నప్పటి నుంచి వస్త్రం నాయక్ క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నాడు. చెక్క బ్యాట్, రబ్బరు బంతితో సాధన ప్రారంభించాడు. మొదట్లో బ్యాట్‌ను పట్టుకోవడానికి, బౌలింగ్ వేయడానికి ఇబ్బంది పడి క్రమంగా పట్టు సాధించాడు. వస్త్రంనాయక్ ప్రతిభను గమనించిన పోలీసులు వీరబాబు, కిషన్ తమ జట్టులో చేర్చుకున్నారు. క్రికెట్‌లో రాణిస్తున్న వస్త్రంనాయక్‌కు పటాన్‌చెరువు డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డి క్రికెట్ కిట్లు అందజేయడంతో పాటు పలు విధాలుగా సహకారాలు అందించారు.

**ప్రతిభతో ముందడుగు**

పానగల్ పాఠశాలలో 2010లో పదో తరగతి చదువుతున్న సమయంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో దివ్యాంగుల జిల్లా స్థాయి క్రికెట్ జట్టుకు వస్త్రంనాయక్ ఎంపికయ్యాడు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ జట్టులో స్థానం సంపాదించాడు. కర్నూలు, అనంతపూర్ జిల్లాల్లో జరిగిన మ్యాచ్‌ల్లో ఆల్‌రౌండర్‌గా రాణించాడు. 2012 నుంచి ఇప్పటి వరకు పలు రాష్ట్రాల్లో రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లు ఆడాడు. 2024లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన సౌత్ జోనల్ మ్యాచ్‌లో ప్రతిభ చాటి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. నేపాల్‌లో జరిగిన 20-20 ట్రై సీరిస్‌లో వస్త్రంనాయక్ ఆల్‌రౌండర్‌గా రాణించి 78 పరుగులు సాధించడంతో ఏడు వికెట్లు తీసి రాణించి జట్టు కప్ గెలవడంలో కీలకంగా మారాడు

**స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం ఇవ్వాలి**

2010 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి నాకు ఎటువంటి సాయం అందలేదు. అప్పుడప్పుడు కొందరు స్పాన్సర్లు ముందుకు వచ్చారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం కల్పించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు, పోలీస్ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు కూడా అందజేశా. నా సమస్యను పరిష్కరించాలి.

-వస్త్రంనాయక్

## స్వయం'ఉపాధి'తో

అంగవైకల్యాన్ని అధిగమించి ఓ యువకుడు స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరో వ్యక్తికి జీవనోపాధి కల్పించి ఆదర్శంగా నిలిచాడు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన దివ్యాంగుడు వీరమల్ల యాదగిరి. పుట్టుకతో రెండు కాళ్లూ చచ్చుబడ్డాయి. ఆర్థిక భారంతో చదువును కొనసాగించలేకపోయాడు. కుటుంబానికి కొంతైనా అండగా ఉండటానికి ఓ పంచర్ దుకాణంలో చేరాడు. యాదగిరికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. యాదగిరి జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో పంచర్(గాలి) దుకాణం ఏర్పాటు చేసుకుని రోజుకు రూ.500 నుంచి 600లు సంపాదిస్తున్నాడు. ఓ వ్యక్తికి జీవనోపాధి కల్పిస్తున్నాడు. తన కష్టాన్ని చూసి కొందరు దాతలు కుమార్తెల చదువుకు పుస్తకాలు, నగదు అందజేస్తూ సహకరిస్తున్నారని తెలిపాడు.

(ఆంధ్రజ్యోతి- సూర్యాపేట టౌన్)


పంచర్ వేస్తున్న యాదగిరి

**ప్రభుత్వం సాయం అందించాలి**

కాళ్లు లేనందున బలం తక్కువగా ఉంది. దీంతో పెద్ద టైర్లను పంచర్ వేయలేకపోతున్నా. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి. ప్రతిఒక్కరూ ధైర్యంతో బతికితే ఏదైనా సాధించవచ్చు.

- వీరమల్ల యాదగిరి, పంచర్ దుకాణ నిర్వాహకుడు

# వ్యవసాయ యాంత్రీకరణకు గ్రీన్‌సిగ్నల్

5వ పేజీ తరువాయి..

పవర్ వీడర్లు, కిసాన్ డ్రోన్‌లతోపాటు ఇతర యంత్రాలను పంపిణీ చేస్తారు. 2018 నుంచి 2023 వరకు యంత్రాలు రాకపోవడంతో రైతులకు ఇబ్బందిని కలిగిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది.

***తొలివిడతలో 1,552 మందికి ప్రయోజనం***

రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 1,552 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఉత్తర్వులు జారీచేసింది. నల్లగొండ జిల్లాలో 820 మంది రైతులకు పరికరాల కోసం రూ.1,81,36,000ను కేటాయించింది. సూర్యాపేట జిల్లాలో 457 మంది రైతులకు రూ.1,06,01,000ని కేటాయించగా, యాదాద్రి భువనగిరి జిల్లాలో 275 మంది రైతులకు రూ.72.5 లక్షలను మొత్తంగా ఉమ్మడి జిల్లాకు రూ.3,59, 86, 000ను కేటాయించింది. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించేందుకు త్వరలో ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయిలో అవగాహన సదస్సులతోపాటు ప్రదర్శనలు నిర్వహించే అవకాశాలున్నాయి. అయితే ఆర్థిక సంవత్సరం ముగింపునకు కొన్ని రోజులే ఉన్నందున ఈనెలలోపే అవగాహన సదస్సును నల్లగొండలో ఏర్పాటు చేసి సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లా రైతులు ఈ ప్రదర్శనలు పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. పరికరాలు యంత్రాలు తయారు చేసే సంస్థల సహకారంతో రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే సీజన్ ముగిసేందుకు సమయం వచ్చినందున త్వరగా పరికరాలు అందజేయడం కోసం ప్రభుత్వం యోచిస్తుంది. త్వరలో జరిగే అవగాహన, ప్రదర్శనలు వ్యవసాయ అనుబంధ రంగాలను భాగస్వాములను చేయనున్నారు. గత ప్రభుత్వంలో వచ్చిన ఆరోపణలు, విమర్శలకు తావు ఇవ్వకుండా పారదర్శకంగా పథకాన్ని అమలు చేయడం కోసం సదస్సులను ఏర్పాటు చేయనున్నారు.అర్హులైన రైతులందరికీ వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించిన పరికరాలను రాయితీపై ఇవ్వాలని నిర్ణయించారు. వ్యవసాయరంగం అభివృద్ధి చెందాలంటే కూలీలు ఉన్న ప్రస్తుత సమయంలో యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయడమే మంచిదని ప్రభుత్వం భావించింది. అధికారులు ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో అత్యధికంగా రైతులకు ప్రయోజనకంగా ఉండే పరికరాలను ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శన రెండు రోజులు నిర్వహించే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం కూడా ఉంది. మందుల పిచికారీకి డ్రోన్లు కూడా ఉపయోగించే విధంగా అవగాహన కల్పిస్తారు. ఆరేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఆటకెక్కిన నేపథ్యంలో రైతులకు ఈ పథకం అందుబాటులో లేకుండాపోయింది. తాజాగా ప్రస్తుత ప్రభుత్వం తీసుకొస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకం రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

***ఈ నెలాఖరులోగా పథకం అమలు చేస్తాం***



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెలాఖరులోగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద పరికరాలను రైతులకు అందజేస్తాం. ఇప్పటికే ప్ర భుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. యాంత్రీకరణ పథకం నిరంతరంగా కొనసాగనుంది. ప్రతి రైతుకు ఈ పథకాన్ని వర్తింప చేయడంకోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుం ది. తొలివిడత ఈ నెలాఖరులో పూర్తి చేసి మళ్లీ ప్రభుత్వం నిధులు కేటాయించిన వెంటనే రెండో విడత పథకాన్ని అమలు చేస్తూ ముందుకు సాగడం జరుగుతుంది. ప్రతీ రైతు ఆధునిక వ్యవసాయ చేయడంకోసం ప్రభుత్వం ఈ కార్యాచరణ రూపొందించింది.

-పి.శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ

# దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై బీఆర్ఎస్ వివక్ష

***అసెంబ్లీలో ఎమ్మెల్యే వేముల వీరేశం***

నార్కట్‌పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ దక్షిణ తెలంగాణ ప్రాంతంలోని ప్రాజెక్టులపై వివక్ష చూపిందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం తమ బినామీలకు ప్రాజెక్టుల పేరిట టెండర్లు కట్టబెడితే...14 నెలల తమ ప్రభుత్వం, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో బీ.వెల్లెంల నుంచి రైతాంగానికి నీళ్లిచ్చిందంటూ బీఆర్ఎస్‌పై సెటైర్లు విసిరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో భాగంగా శాసనసభలో గురువారం వీరేశం మాట్లాడారు. బీ.వెల్లెంల ప్రాజెక్టును ప్రారంభించడంతో పాటు పరిసర గ్రామాల రైతులకు సాగునీటిని అందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వలను పట్టించుకోకపోతే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన సొంత ఖర్చుతో కాల్వను తవ్వించిన విషయాన్ని వీరేశం గుర్తుచేశారు. పదేళ్ల అధికారంలో ఉండి ప్రాజెక్టుల కోసం నిధులు ఇవ్వని బీఆర్ఎస్ నాయకులకు 14 నెలల్లోనే ప్రజాప్రభుత్వంగా మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు.



వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్, అధ్యాపకులు

## వికసిత్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఎన్‌జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. సముద్రాల ఉపేందర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి అన్నారు. వికసిత్ భారత్ పోస్టర్‌ను గురువారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగొండ, యాదాద్రి, నాగర్ కర్నూల్ జిల్లాల పరిధిలోని యువకులు మై భారత్ పోర్టల్‌లో ఈనెల 16 వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ అనే అంశంపై ఒక్క నిమి షం వీడియో తీసి పంపాలని కోరారు. నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఈ నెల19 నుంచి 20 వరకు జరిగే నోడల్ స్థాయిలో ఉత్తమ ప్రతి భతో ఎంపికైన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి 10 మంది విద్యార్థులను పంపుతారని అన్నారు. కార్యక్రమంలో హరికిషన్, వీరాస్వామి , శేఖర్, స్వప్న వెంకట్‌రెడ్డి, శివరాణి, సావిత్రి, మల్లేశం, కోటయ్య, పాల్గొన్నారు.



# యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.30,58,258 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు

***యాదగిరికొండపై కామ దహనం***

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో కామ దహనం కార్యక్రమం నిర్వహించారు. స్వాగత తోరణం వద్ద ప్రత్యేక పూజల అనంతరం గురువారం పురోహితుడు నాగరాజుశర్మ దహన విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, ఎస్పీఎఫ్ ఎస్ఐ అనిల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కొండకింద వైకుంఠద్వారం చెంత స్థానిక భక్తులు దహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు గౌళికర్ భానుప్రకాశ్, బాలరాజు, జగిని విజయ్ పాల్గొన్నారు. కాగా శుక్రవారం హోలీ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక సేవ చేపట్టి పూజలు నిర్వహిస్తారు. హోలీ విశిష్టతను అర్చకులు వివరిస్తారు.


కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు


కొండపైన కామ దహనం చేస్తున్న ఆలయ సిబ్బంది

***హ్యాంగర్ ఫ్యాబ్రిక్ బిగించే పనులు ప్రారంభం***

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎండలు ఫిబ్రవరి చివరి నుంచే ముదిరాయి. దీంతో కొండపైన ఈ సమస్యలను అధిగమించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లకు నడుం బిగించింది. వేడిమిని తట్టుకునేందుకు తిరువీధుల్లో పూర్తిగా చలువ తెలుగు రంగు (కూల్ వైట్ పెయింట్) వేశారు. అయితే ఈ రంగుపై సూర్యకాంతి వెదజల్లి (రిఫ్లెక్షన్) భక్తుల కళ్లు మూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో తిరువీధుల్లో జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్ బిగించే పనులు గురువారం ప్రారంభించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు తర్వాత తిరిగి హ్యాంగర్ ఫ్యాబ్రిక్‌ను బిగించనున్నట్లు ఇప్పటికే ఈవో భాస్కర్‌రావు తెలిపారు. అలాగే తాగునీటి సదుపాయాలు కూడా అందుబాటులో ఉంచారు.



# నేత్రపర్వంగా లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవం

మఠంపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో భక్తవత్సలుని కల్యాణోత్సవాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆద్యంతం హరినామ స్మరణతో జరిగిన ఈ పరిణయోత్సవ క్రతువులో తీర్థజనులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు. ప్రాతఃకాలార్చనల అనంతరం స్వయంభువునికి పంచామృతాలతో పంచసూక్త విధానంగా అభిషేకాలు చేపట్టారు. వస్త్రాలంకరణలు పూలంగి సేవలు పూర్తయ్యాక ఉదయం యాగశాలలో సుదర్శన నారసింహ హోమం జరిగింది. ఉదయం 9.30నిషాలకు చెంచులక్ష్మి, రాజ్యలక్ష్మి సమేత దివ్యమూర్తులను ప్రధాన మండపంలోకి వేంచేయించి శ్రీ స్వామికి పాద ప్రక్షాళనంగావించారు. మాంగళ్య యజ్ఞోపవీత ధారణలు, అక్షతారోహణం జరిపించి ఉత్సవ మూర్తులను ఆలయ ప్రదక్షణం చేయించారు. మధ్యాహ్నం వరకు ఆలయంలో విశేష పర్వాలు, అర్జిత సేవలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈవో సిరికొండ నవీన్, పాలకవర్గ సభ్యులు, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



### శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : సీఐ రాజు

మర్రిగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజు అన్నారు. నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన నవీన్‌కుమార్ హైదరాబాద్ మల్టీజోన్‌కు బదిలీ అయ్యారు. నల్లగొండ ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న రాజు నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

### నల్లగొండ ట్రాఫిక్ సీఐగా మహాలక్ష్మయ్య

నల్లగొండ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నల్లగొండ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.మహాలక్ష్మయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీసీఎస్ నల్లగొండలో విధులు నిర్వహిస్తున్న మహాలక్ష్మయ్యను ట్రాఫిక్ సీఐగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన రాజు నాంపల్లి సీఐగా బదిలీ అయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## కోతలు లేకుండా విద్యుత్

**చంద్రశేఖర్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ, నార్కట్‌పల్లి**



ఈ వేసవిలో కోతలు లేకుండా నిరంతరం కరెంట్ సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నట్లు నార్కట్‌పల్లి ట్రాన్స్‌కో ఏఈ కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. వినియోగదారుల డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరాకు శాఖాపరంగా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. (నార్కట్‌పల్లి,ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ Interview

**ఆంధ్రజ్యోతి:** మండలంలో ఎన్ని సబ్‌స్టేషన్లు ఉన్నాయి?

**ఏఈ:** నార్కట్‌పల్లి మండలంలో (33/11 కేవీ సామర్థ్యం గల) మొత్తం 8 సబ్‌స్టేషన్లు ఉన్నాయి.

**ఆంధ్రజ్యోతి:** కేటగిరీల వారీగా ఎంత మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు.

**ఏఈ:** మండలవ్యాప్తంగా మొత్తం 17,767 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 7,881 గృహజ్యోతి పథకం పరిధిలోనికి రానివి ఉన్నాయి. అదేవిధంగా సుమారు 7,500 వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

**ఆంధ్రజ్యోతి:** ఈ వేసవిలో ఏమైనా అధికారికంగా కరెంటు కోతలు విధించే పరిస్థితి ఉందా.

**ఏఈ:** సాంకేతికంగా ఏమైనా సమస్య తలెత్తితే తప్ప కరెంటు కోతలు విధించే అవకాశమే లేదు. పైగా వినియోగదారులు వాడినంత మేర విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

**ఆంధ్రజ్యోతి:** వేసవిలో కరెంటు కొరత నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

**ఏఈ:** వేసవిలో కరెంటు కొరత, నిర్వహణ వైఫల్యాలు ఎదురవకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. చెర్వుగట్టు, అమ్మనబోలు విద్యుత్ ఉప కేంద్రాల్లో ఇప్పటికే ఉన్న పీటీఆర్‌ల సామర్థ్యాన్ని పెంచాం.

**ఆంధ్రజ్యోతి:** అదనపు విద్యుత్ లైన్లను వేస్తున్నారా.

**ఏఈ:** చెర్వుగట్టు, గోపలాయపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో స్టాండ్ బై కింద రెండు లైన్ల ఏర్పాటు పనులు పూర్తి కావస్తున్నాయి. వీటిని వినియోగంలోకి తేవాలంటే ఎల్‌సీ తీసుకోవాల్సి ఉంటుంది. వేసవి తర్వాత వీటిని వాడకంలోకి తెస్తాం.

**ఆంధ్రజ్యోతి:** వినియోగదారులకు మీరిచ్చే సూచన

**ఏఈ:** విద్యుత్ వినియోగదారులకు సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఏమైనా సమస్యలు ఉంటే 9440813560 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి. ప్రతీ నెలా విద్యుత్ వినియోగ బిల్లులను బాధ్యతగా చెల్లించాలి.

# నీలగిరిలో పార్కింగ్ పరేషాన్



పట్టణంలోని ప్రకాశంబజార్‌లో రోడ్లపై నిలిపిన వాహనాలు



- వాహనం నిలపడానికి ప్రజల ఇబ్బందులు
- షాపింగ్ కాంప్లెక్స్‌లకు పార్కింగ్ కరువు
- జరిమానాలు వేస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో పార్కింగ్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద జిల్లా కావడంతో జిల్లా కేంద్రం ప్రజలు, వాహనదారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు కూడా తమ సొంత వాహనాలతోనే పట్టణానికి వచ్చి తమ పనులను చేసుకుని తిరిగి వెళ్తుంటారు. దీనికి తోడు పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్‌కు వచ్చే వారు సైతం టూ వీలర్, ఫోర్ వీలర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో పట్టణంలో రోజు రోజుకూ వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. జిల్లా కేంద్రంలో వివిధ పనుల నిమిత్తం బయటికి వెళ్లే వారు ఆ పనులు చేసుకోవాలంటే బండి ఎక్కడ పార్కింగ్ చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలో ఉన్న షాపింగ్ మాల్స్‌కు సింహభాగం 85 శాతం పార్కింగ్ సదుపాయం లేదు. షాపింగ్ మాల్స్ సెల్లార్‌లో కొంత పార్కింగ్‌కు కేటాయిస్తుండగా అక్కడికి అధికసంఖ్యలో ప్రజలు వస్తుండటం తో పార్కింగ్ సరిపోక ఎక్కువ మంది రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఇకపోతే జిల్లా కేంద్రం కావడంతో పాటు మునిసిపాలిటీ ఉన్నా కానీ పట్టణంలో ఏ ప్రాంతంలో కూడా ప్రభుత్వ పార్కింగ్ స్థలం లేకపోవడం వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

### రోడ్డుపై పార్క్ చేస్తే పోలీసుల జరిమానాలు

వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన సమయంలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్లపై వాహనాలు నిలిపితే పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. గతంలో రూ.200 ఉన్న జరిమానా ప్రస్తుతం రూ.1000కి చేరడంతో షాపుల ఎదురుగా, రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రకాశం బజార్‌తో పాటు అక్కడ ఉన్న ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ కూరగాయల దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాల వద్ద విపరీతంగా వాహనాలు రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో పాటు హైదరాబాద్ రోడ్డులో షాపింగ్ మాల్స్, మద్యం దుకాణాలు, వస్త్ర, వ్యాపార దుకాణాలు, బేకరీలు, రెస్టారెంట్ల వద్ద సైతం పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో పోలీసులు ఇట్టే ఫొటోలు కొట్టి జరిమానాలు విధిస్తుండగా వాహనదారులు పని చూసుకొని వచ్చే వరకు జరిమానా మెసేజ్ సెల్‌కు వచ్చేస్తుంది. పట్టణంలోని ప్రకాశంబజార్, హైదరాబాద్ రోడ్డు, రామగిరి, దేవరకొండ రోడ్డులోని మార్ట్‌లు, హాస్పిటల్స్ వద్ద పార్కింగ్ సమస్య అధికంగా ఉంది. కనీసం వ్యాలెట్ పార్కింగ్ సదుపాయం సైతం లేకపోవడంతో వాహనదారులకు జరిమానాలు, ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి పట్టణంలో పార్కింగ్ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


### రోడ్లపై నిలిపితే జరిమానా



నల్లగొండ పట్టణంలో వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. షాపింగ్, ఇతర విక్రయాలకు వచ్చిన సమయంలో పార్కింగ్ స్థలంలోనే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేస్తే జరిమానాలు తప్పవు. పట్టణంలో ప్రకాశంబజార్, హైదరాబాద్ రోడ్డు, దేవరకొండ రోడ్డు, రామగిరితో పాటు పలు ప్రాంతాల్లో ఈ సమస్యను గుర్తించాం. కానీ రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసి ఇతర వాహనదారులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

- శివరాంరెడ్డి, డీఎస్పీ, నల్లగొండ

### పార్కింగ్ సమస్యకు పరిష్కారం చూపాలి



పట్టణంలో బైక్‌పై బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. షాపింగ్‌కు వెళ్లి ఏమైనా కొనుగోలు చేయాలంటే ఎక్కడ పార్కింగ్ చేయాలో అర్థం కావడం లేదు. అక్కడ ఉన్న పార్కింగ్ స్థలం కొద్దిగానే ఉండటంతో సరిపోవడం లేదు. రోడ్లపై బైక్ పార్కింగ్ చేస్తే పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. పార్కింగ్ సౌకర్యం కల్పించని యజమానులపై చర్యలు తీసుకోవాలి. పట్టణంలో పార్కింగ్ సమస్యకు అధికారులు చొరవ చూపి పరిష్కారం మార్గం ఆలోచించాలి.

- చింతపల్లి లింగమయ్య, శాంతినగర్, నల్లగొండ

### పెరుగుతున్న వాహనాల సంఖ్య

నల్లగొండ పట్టణంలో వాహనాల వినియోగం పెరిగింది. ప్రతీ ఇంటికి ఒకటి రెండు ద్విచక్ర వాహనాలు ఉండటంతో పాటు ఫోర్ వీలర్ల సంఖ్య సైతం పెరిగింది. వాహనదారులు ప్రతీ రోజూ ఉదయం నుంచి సాయంత్రం సమయంలో ఏదో ఒక పని మీద బయటికి వస్తుంటారు. పార్కింగ్ చేయాలంటే స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే షాపింగ్ మాల్స్ వద్ద 85 శాతానికి పైగా పార్కింగ్ లేదు. మాల్స్ ఎదుటనే అధిక సంఖ్యలో వాహనాలు పార్క్ చేయడంతో రోడ్లన్నీ రద్దీగా మారుతున్నాయి.

## వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం



రామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చండూరురూరల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): చండూరు మండలం తుమ్మలపల్లి పార్వతీ రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం స్వామి వారికి గవ్యాంతపూజలు, స్నపనము, బలిహరణ కార్యక్రమం జరిగింది. రాత్రి ఉత్సవ విగ్రహాలను గుట్టపై నుంచి ఎదుర్కోలుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వేకువజామున స్వామివారి కల్యాణానికి ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను దేవాలయ కమిటీ చైర్మన్ గున్‌రెడ్డి రమ్య రామలింగారెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి కలిసి అందజేశారు. ఈ కల్యాణ మహోత్సవానికి చండూరు మండలమే కాకుండా నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, కనగల్ తదితర మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి తలంబ్రాలు సమర్పించి వారి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు కురుపాటి వెంకటమ్మ, బోయపల్లి రాములు, జిల్ల నర్సింహ్మా, కారువంగ నర్సింహశర్మ, మాజీ చైర్మన్ గజ్జల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కోడి శ్రీనివాసులు, గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో వెంకయ్య

కేతేపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య అన్నారు. కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామ పంచాయతీ గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చ చేశారు. అనంతరం కేతేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇంటి పన్నులు నూటికి నూరుశాతం వసూలు చేయాలని సూచించారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తే గ్రామాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల పురోగతి, నర్సరీల నిర్వహణపై సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంపీవో జి.నాగలక్ష్మి, మిషన్ భగీరథ ఏఈ సాయికుమార్, ఏపీవో ఎస్.సురేందర్ పాల్గొన్నారు.

- చండూరు రూరల్: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మంచినీటి కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బండారు యాదగిరి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవికాలం ప్రారంభంలోనే మండలంలో భూ గర్భజలాలు అడుగంటాయని, గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ బోర్లు పనిచేయని గ్రామాల్లో అద్దె బోర్లను తీసుకుని నీటి సరఫరా చేయాలని, లేనిచో ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

కనగల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి (డీఎల్ఎస్ఏ సెక్రటరీ) దీప్తి అన్నారు. గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లో (జీసీఈసీ) భాగంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కనగల్ మోడల్ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్యవివాహాలు, ర్యాగింగ్, పోక్సో చట్టం తదితర అం శాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ థామసయ్య, జీసీఈసీ కన్వీనర్ రాధిక పాల్గొన్నారు.

# వర్గీకరణ అనంతరమే ఉద్యోగాల భర్తీ చేపట్టాలి



నల్లగొండ : కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన దీక్షలో పాల్గొన్న నాయకులు

నల్లగొండటౌన్, కేతేపల్లి, శాలిగౌరారం, చిట్యాల, నకిరేకల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన తర్వాతే రాష్ట్రంలో ఉద్యోగాలను భర్తీ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వర్గీకరణ బిల్లు వచ్చే వరకు ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిరవధిక దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ చట్టం చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం మాదిగలను మోసం చేయడమేనని ఆరోపించారు. అంతేకాకుండా మాదిగలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

- డాక్టర్ షమీం అక్తర్ ఇచ్చిన నివేదికలో లోపాలను న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్‌కమిటీ సభ్యుడు అంది రాంబాబు, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ అన్నారు. దీక్షలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కురుపాటి కమలమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ దేవయ్యమాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరిక శ్రీనివాస్‌మాదిగ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్న యాదవ్, నాయకులు ఏడుకొండలు మాదిగ, వెంకట్ మాదిగ, చైతన్యరెడ్డి, కొమ్ము హరి, జలందర్, సైదులు, లక్ష్మారెడ్డి, వెంకన్న, శంకర్ పాల్గొన్నారు.
- కేతేపల్లిలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి ప్రసాద్ మాట్లాడుతూ వర్గీకరణ చట్టం వచ్చే వరకూ ఉద్యోగాల భర్తీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి ఎన్.వెంకటరత్నం, లక్ష్మయ్య, వంగూరి నరేష్, రవి, మోజెస్, సురేష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.
- శాలిగౌరారంలో నిర్వహించిన దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు కారుపాటి అంబేడ్కర్‌మాదిగ, మండల నాయకులు బట్ట సైదులు, బాకీ వెంకన్న, మొలుగూరి సోమయ్య, వేముల శ్రీకాంత్, మాచర్ల ప్రతాప్, శ్రీను తదితరులు పాల్గొన్నారు
- చిట్యాలలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి శంకర్‌మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్, నాయకులు నేముల పురుషోత్తం, మేడి కృష్ణ, కావలి కృష్ణ, రమేష్, శ్రీను, జిట్ట శేఖర్, జిట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.
- నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ, నాయకులు మాచర్ల సుదర్శన్, చిట్టిపాక అంజయ్య, చెట్టిపల్లి రాజు, వెంకన్న, లింగయ్య, విజయ్, రాజు, నాగయ్య, రేణయ్య, జయప్రకాష్, చందు తదితరులు పాల్గొన్నారు.

### కూలీలకు రూ.300 అందేలా చూడాలి

మర్రిగూడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.300లను కూలీ పడే విధంగా పనులు చేయించాలని ఎంపీడీవో మున్నయ్య ఆదేశించారు. గురువారం మండలంలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు ఉపాధి పనులను కూలీ లు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. ఆయన వెంట కార్యదర్శి యూసుఫ్, వెంకటయ్య పలువురు ఉన్నారు.

### నీటి వసతి ఆధారంగా సాగు చేయాలి

మునుగోడురూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రైతులు నీటి వసతి ఆధారంగా పంటలను పండించుకోవాలని ఏవో ఎస్.పద్మజ అన్నారు. మండలంలోని పులిపలుపుల గ్రామంలో గురువారం ఎండిపోతున్న వరి పొలాలను ఆమె పరిశీలించారు. బిందు సేద్యంలో ఆయిల్‌పాం తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. దీనికి ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో నర్సింహ, రైతులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకే డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ, మార్చి13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సమీపంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను గత ప్రభుత్వ హయాంలో డ్రా ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకే కేటాయించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంత్రి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు బూత్ బంగ్లాలుగా మారాయని, ప్రస్తుతం దర్వాజాలు, కిటికీలు లేకపోవడంతో పాటు డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు రాజకీయ లబ్ధికోసం లబ్ధిదారులను రెచ్చగొట్టి ఇళ్లలోకి వెళ్లాలని ప్రోత్సహిస్తున్నారని, సమంజసం కాదన్నారు. మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలతో రూ.6కోట్లతో శిథిలావస్థకు చేరిన డబుల్‌బెడ్ రూం ఇళ్లకు మరమ్మతులు చేపట్టి రెండు నెలల్లో మంత్రి వెంకట్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రాజకీయ లబ్ధికోసం డ్రా తీసి ఇళ్లు కేటాయించిందని విమర్శించారు. ప్రస్తుతం డబుల్‌బెడ్ రూం ఇళ్లు నివాసానికి పనికిరావని, తమ ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పించి కేటాయించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులందరితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇంటి నమూనాను బీజేపీ నాయకులు విమర్శించడం సిగ్గుచేటన్నారు. జిల్లా కేంద్రంలోని 18 వార్డుల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నాయకులు దుబ్బ అశోక్ సుందర్, యాదయ్య, శంకర్, వెంకన్న, గోపాల్, హరిప్రసాద్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం : సీపీఎం

కేతేపల్లి, రామగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని కల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలులో నిర్లక్ష్యం వహించడం తగదని అన్నారు. సమావేశంలో నాయకులు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు కోట లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

- నల్లగొండ పట్టణంలోని సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ కమిషనర్‌నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సయ్యద్ హాశం, సలీం పాల్గొన్నారు.

## రోడ్డును కప్పేసిన మట్టి తొలగింపు

**'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ**



రోడ్డుపై పేరుకున్న మట్టి తొలగింపు పనులు చేయిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్

నార్కట్‌పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'రోడ్డు అంచుల్ని కప్పేసిన మట్టి' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జాతీయ రహదారిపై హోటళ్ల ఎదురుగా రోడ్డు అంచును కప్పేసిన మట్టి కారణంగా పొంచిఉన్న ప్రమాదంపై కథనంలో పేర్కొన్న కారణాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది రోడ్డుపై పేరుకుపోయిన మట్టి తొలగించారు. నార్కట్‌పల్లి నుంచి చిట్యాల వరకు ఉన్న హోటళ్ల ఎదురుగా రోడ్డుపైకి చేరిన మట్టిని ఎక్స్‌కవేటర్ ద్వారా శుభ్రం చేశారు. దీంతో పలువురు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

### కంప చెట్ల తొలగింపు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తొలగించిన కంపచెట్లు

శాలిగౌరారం: శాలిగౌరారంలోని బస్ స్టేజీ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న కంపచెట్లను విద్యుత్ సి బ్బంది తొలగించారు. ఈ నెల 7న 'ఆంధ్రజ్యోతి'లో కంప చెట్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్, ప్రమాదకరంగా మారిన పట్టించుకోని అధికారులు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సిబ్బందిని ఆదేశించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంప చెట్లను తొలగించారు.

## ఘనంగా కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు

నల్లగొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను గురువారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కంచర్ల రమాదేవి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జాగృతి సంస్థను స్థాపించి మహిళా లోకాన్ని జాగృతం చేసిన నాయకురాలని కొనియాడారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత కవితకే దక్కిందని అన్నారు. అంతకుముందు తులసీనగర్‌లోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వారి బంధువులకు, అల్పాహారాన్ని అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జాగృతి రాష్ట్ర నాయకులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు సింగం రామ్మోహన్, కొండూరు సత్యనారాయణ, బొజ్జ వెంకన్న, బడుపుల శంకర్, గుండెబోయిన జంగయ్య, ఆటో యూనియన్ అధ్యక్షుడు యాదయ్య, రాములు, అశోక్, మహేందర్‌రెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రంగు మారిన కృష్ణా వాటర్

మర్రిగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ద్వారా నీటిని పంపిణీ చేస్తున్న కృష్ణా జలాలు గురువారం రంగు మారాయి. గురువారం ఉదయం సరఫరా అవుతున్న నీటిని పట్టుకోవడానికి వెళ్లిన ప్రజలు రంగుమారిన నీటిని చూసి భయాందోళనకు గురయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో పసుపు, ఎరుపు రంగు నీరు వచ్చిందని ప్రజలు తెలిపారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు వివరణ కోరగా మెయిన్ పైపు మిషన్ భగీరథ పలిగిపోవడం వల్ల వాటిని మరమ్మతులు చేయడం వల్ల నీరు రంగు మారిందన్నారు.

## సంక్షిప్తంగా

- చిట్యాలరూరల్: చిట్యాల మండలం తాళ్లవెల్లంల శివారులోని ఆర్గానిక్ కృష్ణ మందిర్‌లో శుక్రవారం శ్రీకృష్ణ సంపూర్ణ కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు మందిరం నిర్వాహకుడు పామనగుళ్ల వెంకన్న తెలిపారు.
- మునుగోడు, కనగల్: మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మునుగోడు బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, కనగల్ బాలబాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని కోరారు.
- మునుగోడు: మునుగోడు మేజర్ గ్రామపంచాయతీలో ప్రతీ గురువారం జరిగే పశువుల సంత, తైబజారుకు బహిరంగ వేలంపాట 18వ తేదీన నిర్వహించనున్నట్లు కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గలవారు పశువుల సంతకు రూ.80వేలు, తైబజారుకు రూ.30వేలు డీడీ తీసి తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.
- కనగల్: కనగల్ గ్రామంలోని జడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు గురువారం న్యాకంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శివలీల, హెచ్ఎం విజయభార్గవి, సభ్యులు నాగమణి పాల్గొన్నారు.
- మునుగోడు రూరల్: నార్కట్‌పల్లి నుంచి సింగారం మీదుగా మునుగోడు, చండూరు వరకు ఆర్టీసీ బస్సును గురువారం ప్రారంభించారు.
- మునుగోడు రూరల్: కల్వలపల్లి గ్రామానికి బస్సును పునఃప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. పోరుబాట కార్యక్రమంలో మండలంలోని కల్వలపల్లి గ్రామంలో ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, నాయకులు వంటేపాక రమేష్, లక్ష్మయ్య, మల్లేష్, సైదులు, ఎల్లయ్య, రాములు, అంజయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.
- చిట్యాల: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రీన్‌గ్రోవ్ పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్‌మీట్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సైదానాయక్, ఎస్ఐ ధర్మా పాల్గొన్నారు.
- నార్కట్‌పల్లి: మండలకేంద్రంలోని కుమ్మర శాలివాహన సంఘం భవనంలో కవయిత్రి మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాదారపు బిక్షపతి, నాయకులు సైదులు, రాజు, దేవయ్య, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.
- శాలిగౌరారం: గ్రామీణ ప్రాంతాల్లో పేదల కోసం ఏర్పాటు చేసే కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ యాదగిరి అన్నారు. మండలంలోని వంగమర్తి గ్రామంలో లయన్స్ క్లబ్, సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రి వారి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 120 మందికి కంటి పరీక్షలు చేశారు.

**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | : 18004251442 |
| యాదాద్రి | : 1800 425 7106 |
| సూర్యాపేట | : 1800 425 1972 |

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 60

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.112 | 175 | 200 |
| సూర్యాపేట | రూ.125 | 180 | 210 |
| నల్లగొండ | రూ.125 | 195 | 210 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 20.0

# మానసికంగా బలంగా ఉండాలి

- నిత్య జీవితంలో క్రీడలను అలవాటు చేసుకోవాలి
- పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కలెక్టర్ ఇలాత్రిపాఠి
- ఆటుపోట్లను తట్టుకునేందుకు క్రీడలు దోహదం : ఎస్పీ
- ప్రారంభమైన పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్







పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పోలీసులు శారీరక ధృడంతోపాటు మానసికంగా ధృడంగా ఉండాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఆమె ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో చాలెంజింగ్ కేసులను చేధించే పనిలో నిమగ్నమయ్యే పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆ శాఖలో టీమ్ స్పిరిట్ చాలా ముఖ్యమన్నారు. పోలీస్ ఉద్యోగం నిరంతరం ఒత్తిడితోపాటు చాలెంజింగ్ ఉద్యోగమన్నారు. పోలీస్ శాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది నిత్య జీవితంలో క్రీడలను అలవాటు చేసుకోవాలన్నారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నిత్యం విధులలో ఉండే అధికారులు, సిబ్బంది ఆటుపోట్లు తట్టుకునేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ సబ్ డివిజన్లతోపాటు ఏఆర్ విభాగం జట్లు సుమారు 300మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, షాట్‌పుట్, అథ్లెటిక్స్‌తోపాటు వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. మహిళా విభాగం షాట్‌పుట్‌లో ప్రథమ బహుమతి శివాని(దేవరకొండ), ద్వితీయ బహుమతి సుజాత, తృతీయ బహుమతి రేణుక(నల్లగొండ) గెలుపొందారు. కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, డీటీసీ డీఎస్పీ విఠల్‌రెడ్డి, నల్లగొడ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అంటే.. ఇలా

పోలీస్ అనే ఆంగ్ల పదానికి కలెక్టర్ తనదైన రీతిలో నిర్వచించారు. 'పి' అంటే ప్రైజర్ 'ఒ' ఓవర్ అన్‌బోట్ 'ఎల్' లైన్‌ఆఫ్ కమాండ్ 'ఐ' ఇంటిట్యూవ్ 'సి' కాలిక్యులేటెడ్ 'ఇ' ఎనర్జీ అని నిర్వచనం చెబుతూ ఇవన్నీ ఉన్న వారే పోలీసులని చెప్పారు.

# వ్యవసాయ యాంత్రీకరణకు గ్రీన్ సిగ్నల్



- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో 1,552మంది లబ్ధిదారులు

ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు అందుకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతోపాటు బడ్జెట్‌ను ఈనెలలో ప్రవేశపెట్టడానికి ముందే లాంఛనంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని చేపడుతున్నారు. వచ్చే బడ్జెట్‌లో వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయి.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో మొదటి విడతగా 1552 మంది రైతులకు రూ.3,59,86,000ను కేటాయించింది. ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించ డం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు ప్రత్యే క తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కొనసాగి న వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఆరేళ్లుగా నిలిచిపోవడంతో రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టిసారించే అవకాశాలు లేకుండా పోయాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగేళ్లపాటు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని నడిపించింది. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు నాలుగేళ్లలో సుమారు రూ.50కోట్లను కేటాయించింది. అయితే యాంత్రీకరణ పథకంలో అత్యధికంగా ట్రాక్టర్లను మంజూరు చేశారు. ఈ ట్రాక్టర్లు అధికంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇచ్చారన్న ఆరోపణలు అప్పట్లో పెద్ద ఎత్తున వెల్లువెత్తడంతో పథకం అభాసుపాలైంది. ఇక కొన్ని పరికరాలను కూడా రాయితీపై ఇచ్చినప్పటికీ రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. పథకం అమలు వివాదాస్పదం కావడంతో అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఆ పథకాన్ని 2018లో అర్ధంతరంగా నిలిపివేసింది. ఆ తరువాత రైతుల నుంచి, రైతు సంఘాల నుంచి పథకం అమలు కోసం డిమాండ్ వచ్చినా, గత ప్రభుత్వం అమలులోకి తేలేదు. దీంతో ఆరేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఊసే లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని పునరుద్ధరించింది. తాజాగా మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది.

### నెలాఖరులోగా రాయితీపై యంత్రాలు...

ఈ సీజన్ ముగిసేలోపు అంటే నెలాఖరున ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని వారికి రాయితీ పై కేటాయించనున్నారు. జిల్లాల వారీగా రైతు ల నుంచి ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి నల్లగొండ, యాదాద్రి భువనగి రి, సూర్యాపేట జిల్లాల వ్యవసాయ అధికారుల నుంచి నివేదికలు సేకరించే పనిలో నిమగ్నమైంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నా గేశ్వర్‌రావు కొన్ని రోజుల క్రితం రాష్ట్ర వ్యవసా య శాఖ కార్యదర్శితోపాటు డైరెక్టర్, ఇతర వ్య వసాయ అధికారులతో సమీక్ష కూడా నిర్వహించారు. రైతులకు అందజేయాల్సిన పనిముట్లు, యంత్ర పరికరాల జాబితాను కూడా రూపొందించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రోటర్‌వేటర్‌లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు...


- మిగతా 7వ పేజీలో...





## రేపటి నుంచి ఒంటిపూట బడులు

- ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు
- వచ్చే నెల 23 వరకు కొనసాగింపు




ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి ఒంటి పూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం నాడు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు ఈనెల 15నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పనిచేస్తాయి.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)


7


## నేడు రంగుల మహో(లీ)త్సవం



హోలీ హోలీల రంగ హోలీ చమ్మకేళిల హోలీ... వరున లేని కాముడమ్మ హోలి చమ్మకేళిల హోలీ... వంటి పల్లె పాటలు, కోలాటాలు, చప్పట్లతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. కుల, మత, వర్గ బేధాలు వీడి, పేద, ధనిక, చిన్నా, పెద్ద అనే తారతమ్యాలను మరిచి అందరూ కలిసి ఆనందంగా జరుపుకునేది హోలీ పండుగ. హోలీ ఆడేటప్పుడు కలిగే ఆనందం మధుర జ్ఞాపకంగా ఉండాలంటే సహజ రంగులు చల్లుకోవాలని, రసాయన రంగులు చల్లుకుని ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పాడు చేయవద్దని డాక్టర్లు, పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)


6


## యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రగమ శాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను అందంగా ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు.




7


ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు

# శిశు మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

**కలెక్టర్ ఇలాత్రిపాఠి**

నల్లగొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): శిశు మరణాలు లేని జిల్లాగా నల్లగొండను తీర్చిదిద్దాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల ఉదయాదిత్య భవన్‌లో మిర్యాలగూడ డివిజన్ పరిధిలో శిశు మరణాలపై గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రసవానంతరం వివిధ కారణాల వల్ల శిశువులు చనిపోవడాన్ని తగ్గించాలని, ఇందుకు వైద్య, శిశు సంక్షేమశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. అవగాహన లోపం, మూఢనమ్మకాలు, సకాలంలో వైద్యం అందకపోవడం తదితర కారణాలతో శిశువులు మృతి చెందకుండా చూడాలని అన్నారు. గర్భిణికి పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వల్ల శిశు మరణాలు తగ్గుతాయని అన్నారు. డాక్టర్లు ప్రతీ నెలా వారి పరిధిలో ఆశా, ఏఎన్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేసి శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ మాతృనాయక్, డాక్టర్ వసుంధర, డాక్టర్ స్వరూప, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

### ప్రత్యేక 'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి

వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి వచ్చే వయోవృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడటాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో 49మంది వయోవృద్ధులు, దివ్యాంగులు హాజరై తమ సమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. సంబంధిత శాఖల అధికారులను తన వద్దకు పిలిపించుకొని ఫిర్యాదులను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదన పు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణఅమిత్, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

### బయోచార్‌పై అవగాహన కల్పించాలి

కట్టంగూరు: పంట వ్యర్థాలతో జీవబొగ్గు(బయోచార్)ను ఉత్పత్తి చేసి పొలంలో వేస్తే కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కట్టంగూరు మండలం చెర్వు అన్నారంలో పంట వ్యర్థాలతో తయారు చేస్తున్న బయోచార్ ఫ్యాక్టరీని గురువారం ఆమె సందర్శించి మాట్లాడారు. బయోచార్ అనేది పంట వ్యర్థాలైన సహజ వనరుల ద్వారా వచ్చేది. దీని ద్వారా నాణ్యమైన పంటలు పండించడం, మట్టి నాణ్యత పెంచడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆక్సిజన్ లేకుండా పత్తి కట్టెను, వరి గడ్డిని, అలాగే ఇతర పంట వ్యర్థాలను వేడి చేసి కట్టెలో సేంద్రియ కర్బనం నిల్వ చేయడం ద్వారా బయోచార్ అనేది తయారవుతుందని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కాలుష్యం పెరగడమే కాకుం డా, ప్రజలు అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ పంట పొలాల వ్యర్థాల సేకరణ, తదితర వివరాలన్నింటిని సంస్థ ప్రతినిధుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.

### సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ఆదాయం

సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాలు ఆదాయాన్ని సృష్టించుకోవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కట్టంగూరు మండలంలోని అయిటిపాములలో ప్రతీక్ ఫౌండేషన్ ఆర్థికసాయంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్వచ్ఛశక్తి సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఉత్పత్తి చేస్తున్న సోలార్ విద్యుత్ ఉత్పత్తి, ఆదాయం, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అయిటిపాముల గ్రామంలో సుమారు 50 గృహాల్లో సోలార్ విద్యుత్ అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిపై పండ్లు, పూలు మొక్కల పెంపకానికి నర్సరీకి స్థలాన్ని ఏర్పాటు కేటాయించాలని నర్సింహారెడ్డి కోరగా అవసరమైన స్థలాన్ని చూడాలని ఆమె తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వరరావు, కట్టంగూరు రైతు ఉత్పత్తుల సమాఖ్య అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సింహారెడ్డి, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ మధు, వ్యవసాయ అధికారులు, స్వచ్ఛశక్తి కేంద్రం ప్రతినిధి సుధాకర్ ఉన్నారు.

## కంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

**డీఎంహెచ్‌వో శ్రీనివాస్**



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

నల్లగొండ టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే సూక్తిని పాటించాలని ప్రతి ఒక్కరూ కంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో కంటి సంబంధిత వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్లకోమా అనేది నిశ్శబ్ధంగా మనిషిలో అంధత్వాన్ని కలిగిస్తుందని, వెంటనే గుర్తిస్తే అంధత్వం నుంచి బయపడవచ్చని అన్నారు. 40ఏళ్ల పైబడిన వారు తరుచూ కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుటుంబంలో ఎవరికైనా గ్లకోమా ఉంటే కుటుంబసభ్యులు గ్లకోమా టెస్టులు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ అరుణకుమారి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాతృనాయక్, కంటి డిపార్ట్‌మెంట్ సీఎస్‌ఎస్, ఎన్‌పీసీబీ డాక్టర్ సువర్ణ, మహేంద్ర, హెచ్‌వోడీ డాక్టర్ సాంబశివారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

### టీబీ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

దామరచర్ల: టీబీ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని స్థానిక సిమెంట్ పరిశ్రమలో గురువారం నిర్వహించిన జాతీయ టీబీ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. టీబీకి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మందులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి కల్యాణ్‌చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు గీతావాణి, వేణుగోపాల్‌రెడ్డి, కేస రవి, మండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి

**ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర ఈడీ మధుసూదన్‌రెడ్డి**



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ సభ్యులు

చిట్యాలరూరల్, చిట్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) ఈడి మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌తో పాటు వట్టిమర్తిలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎస్‌సీఈఆర్‌టీ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు చదవడం, రాయడం, ప్రాథమిక గణితం ప్రతిభను పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచితే వారు సత్ఫలితాలను సాధిస్తారని, పఠించడం, రాయించడం విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలు బోధించిన తర్వాత విద్యార్థులతో పాఠ్యపుస్తకాలను అభ్యసించడం నేర్పించాలన్నారు. వారి వెంట యాసీన్‌మహ్మద్, సీఆర్‌పీ జయకాంత్, రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయురాలు మాధవి,జానకి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ అనైతికం

- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



క్లాక్‌టవర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు

నల్లగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అసెంబ్లీ వేదికగా గొంతెత్తిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జగదీష్ రెడ్డి సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా గురువారం జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్లో బీఆర్‌ఎస్‌నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలన్నారు. సభలో జగదీష్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడు కాంగ్రెస్ సభ్యు లు పదేపదే అడ్డు తగులుతున్నా సభాపతి వారిని నియంత్రించలేక పోయారన్నారు. ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజల సమస్యలను అధ్యయనం చేసి సభ ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని కేసీఆర్ దిశానిర్దేశం చేశారన్నారు. రైతు రుణమాఫీ గురించి, ఎండిపోతున్న పంటల గురించి, రైతుబంధు గురించి లేవనెత్తిన అంశాలను జీర్ణించుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం జగదీష్‌రెడ్డి గొంతు నొక్కిందని విమర్శించారు. పథకం ప్రకారం అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేశారని, ఇది కుట్రపూరితమైన చర్య అన్నారు. జగదీష్ రెడ్డి మాట్లాడుతున్న క్రమంలో అసలు కులం ప్రస్తావన రాలేదన్నారు. జగదీష్‌రెడ్డి మాట్లాడిన విషయంపై స్పష్టత ఇవ్వడానికి కూడా అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇలాంటి సస్పెన్షన్లతో ప్రజా ఉద్యమాలను, ప్రజా గొంతుకలను నిలువరించలేరన్నారు. ఆందోళన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, అయితగోని యాదయ్య, కొండూరు సత్యనారాయణ, కరీంపాషా, తుమ్మల లింగస్వామి, మారగోని గణేష్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మరబోయిన నాగార్జున తదితరులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నిరసన నేపథ్యంలో ఎస్‌ఐలు శంకర్, సైదులు, జయకర్, మానస, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## హోలీని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**ఎస్పీ శరత్‌చంద్ర పవార్**



నల్లగొండ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, చట్టానికి వ్యతిరేక వ్యవహరిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఇతరులకు హాని కలిగించకుండా వేడుకలను నిర్వహించుకోవాలని, ప్రజలు, యువత, అన్ని వర్గాల వారు కలిసి మెలిసి చేసుకోవాలని సూచించారు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేసే ఆకతాయిలపై నిరంతరం షీ టీం నిఘా ఉంటుందని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హోలీ అనంతరం నీటి ప్రవాహం ఉన్న చోటుకి, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## రామలింగేశ్వరస్వామి జాతర ప్రారంభం

చింతపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీదేడు (వెంకటంపేట)లో రామలింగేశ్వర స్వామి ఆలయ జాతర మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, అఖండదీపారాధన నిర్వహించారు. మాజీ ఉపసర్పంచ్ ధరణి పతి రమణారావు, దాసరి శ్రీనివాస్ యాదవ్, ఆశోక్ పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

నాగార్జునసాగర్,మార్చి13(ఆంధ్రజ్యోతి):మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ గురు కుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ గురువారం ఒక ప్రక టనలో తెలిపారు. ఎస్సీఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

## 49 క్వింటాళ్ల పెసలు వేలం



పెసలును వేలంపాట నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

డిండి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): డిండి విత్తనోత్పత్తి క్షేత్రంలో 2023 మార్చిలో పండించిన పెసలును ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వ్యవసాయశాఖ అధికారులు గురువారం వేలం వేశారు. ఆరుగురు ట్రేడర్లు వేలంలో పాల్గొనగా సూర్యాపేటకు చెందిన విజయసాయి ట్రేడర్స్ అత్యధికంగా క్వింటాల్‌కు రూ.4050 పాడి 49 క్వింటాళ్ల పెసలును దక్కించుకున్నారు. నాణ్యత దెబ్బతినకుండా రెండేళ్లుగా కోల్డ్ స్టోరేజీలో పెసలు భద్రపరిచినట్లు ఏడీ నివేదిత తెలిపారు.కార్యక్రమంలో సైంటిస్టు వినయ్, ఏవోలు రామలింగేశ్వరరావు, వెంకన్న, మాధవీలత, రాంబాబు, గడ్డమీది శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యానికి సన్మానం

మిర్యాలగూడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యంను సీపీఐ మండల నేతలు గురువారం అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో సీపీఐ కార్యాలయంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జిల్లా కార్యదర్శిగా కార్య క్రమాలను సమర్థంతంగా నిర్వహించిన సత్యం ఎమ్మెల్సీగా ప్రజా సమస్యలను మండలిలో ప్రస్తావించి పరిష్కార మయ్యేలా చూడాలని ఆకాంక్షించారు.



ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను సన్మానిస్తున్న బంటు వెంకటేశ్వర్లు

## ఎమ్మెల్సీగా శంకర్‌నాయక్ ఎన్నికపై హర్షం

దామరచర్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్యేల కోటాలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ ఎన్నిక కావడంపై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రూపావత్ హరిప్రసాద్ కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తలు ఫలితం దక్కుతుందనడానికి నిదర్శనమే శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్‌ను శాసనమండలికి పంపించడమేనన్నారు. శంకర్‌నాయక్ సాధారణ కార్యకర్తగా, ఎన్ఎస్‌యుఐ నాయకుడిగా, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, డీసీసీ అధ్యక్షుడిగా పార్టీకి సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనార్ధన్, నాయకులు కొమ్ము దాస్, సందాల సదానందం, పగిడి జీడయ్యయాదవ్, సద్దాం, అల్లం నాగరాజు, శ్రీను, షేక్ షఫి, మధు, ఆనంద్, గాంధీ, కుర్ర నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

డిండి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన పార్టీ గ్రామశాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీని బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పేర్కొన్నారు. గత పదేళ్లుగా రేషన్‌కార్డులులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని వెంటనే రేషన్‌కార్డులు అందజేయాలన్నారు. అర్హులైన పేదలకు ఇంది రమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జినుకుల అంజయ్య, బుచ్చిరెడ్డి, ఎండీ. మైనొద్దిన్, వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి




కిడ్నీ సంబంధిత వ్యాధి లక్షణాలను వివరిస్తున్న డాక్టర్ జనార్దన్‌రెడ్డి

మిర్యాలగూడ అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కిడ్నీ సంబంధిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరద్, డాక్టర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ కిడ్నీ డేను గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రి డయాలసిస్ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవశైలితో మారుతున్న ఆహారపు అలవాట్లు అసంక్రమిత వ్యా ధులను చేరువ చేస్తున్నాయన్నారు. ప్రధానంగా మధుమేహంతో బాధపడేవారు కిడ్నీ సంబంధిత జబ్బులకు లోనవుతున్నారని అన్నారు. కిడ్నీ సంబంధిత రోగులను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం కేక్‌కట్‌చేశారు. కార్యక్రమంలో డయాలసిస్ ఇన్‌చార్జి రాంబాబు, పండు, శోభన్, పవన్, శివ, సైదమ్మ పాల్గొన్నారు.

## పశుగణన పకడ్బందీగా నిర్వహించాలి

● పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీవీ.రమేష్

మాడ్గులపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పశుగణన పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీవీ.రమేష్ అన్నారు. మాడ్గులపల్లి మండలంలోని పశువైద్యశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పశువైద్యశాలను, రికార్డులు తనిఖీ చేశారు. అఖిల భారత పశుగణన కార్యక్రమం గురించి, ఆసుపత్రికి వచ్చే పశువుల సమాచారం, మందుల వివరాలు మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పశువైద్యశాలలో తహసీల్దార్ కార్యాలయం కూడా ఉండటంతో పశువైద్యశాలకు వచ్చే పశువులకు, వాహనాల రాకపోకల వల్ల ప్రజలకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. దీంతో ఆయన ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

# పంచాయతీ కార్యదర్శులపై పనిభారం

● ఏడాది క్రితమే పాలకవర్గం పదవీకాలం ● సర్వేలతో సతమతం ● గ్రామ పంచాయతీ ఖాతాలు ఖాళీ

(ఆంధ్రజ్యోతి-చందంపేట)

గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గాలు ఏడాది కాలంగా లేకపోవడంతో అన్ని తానై వ్యవహరిస్తున్న కార్యదర్శులకు పనిభారం పెరుగుతోంది. రోజువారి విధులతోపాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సర్వేలు లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయడం తలకు మించిన భారంగా మారింది. దీనికితోడు గ్రామ పంచాయతీలలో గతేడాదికాలంగా నిధులు లేకపోవడంతో సమస్యల పరిష్కారం చేయలేక ప్రజలకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. చందంపేట మండలం 28 గ్రామ పంచా యతీల్లో నిధులు లేకపోవడంతో వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్యం, మురుగు, తాగునీటి సరఫరా వంటి ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు కార్య దర్శులపై ఆర్థికభారం పడుతోంది. గతేడాది నుంచి



నిధులులేక శిథిలావస్థకు చేరిన ట్యాంకర్

ఒక్కొక్క గ్రామపంచాయతీకి రూ. 3 నుంచి 4 లక్షల నిధుల బకాయిలు ఉన్నాయని, మండలంలో రూ. కోటి బకాయిలు ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్‌కార్డుల జారీకి సంబంధించి లబ్ధి దారులను గుర్తించేందుకు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈసర్వే నిర్వహించిన విధానం ఒక్కొక్క గ్రామ పంచాయతీ కార్యదర్శికి రూ.10 వేల అలవెన్స్‌లు ఇవ్వాల్సి ఉండగా నేటివరకు కూడ అందించలేదు.

### నిధులు లేక ఖర్చుల భారం

గ్రామపంచాయతీల్లో నిధులులేక పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాతాల్లో డబ్బులులేక అత్యవసర పనులకు ఖర్చులు చేయలేక సతమతమవుతున్నారు. మంచినీటి పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతులు, పంచాయతీ ట్రాక్టర్ డీజిల్, గ్రామాల్లో విద్యుత్ దీపాలు కచ్చితంగా నిర్వహించాల్సి ఉంటుంది. వీటిభారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది.

### నిధులు విడుదల చేయాలి



ప్రభుత్వం గతేడాది నుంచి గ్రామ పంచాయతీల్లో ఎలాంటి నిధులు విడుదల చేయక పోవడంతో కార్యదర్శులు అప్పులుచేసి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో మండల వ్యాప్తంగా గ్రామపంచాయతీలకు దాదాపు రూ. కోటి బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలి.

- రామలింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు

# మొల్లమాంబ జీవితం స్ఫూర్తిదాయకం

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మొల్లమాంబ జీవితం స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలనిఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. కవయిత్రి మొల్లమాంబ 585వ జయంతి సందర్భంగా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ సాగర్‌రోడ్డులో గురువారం ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24వేల శ్లోకాలు, 7 ఖండాలతో వున్న రామాయణాన్ని సామాన్యులు చదివి అర్థం చేసుకునే రీతిలో అతి తక్కువ రోజుల్లో 8 ఖండాలతో 871 శ్లోకాలుగా మలిచారన్నారు. 2017లో భారత ప్రభుత్వం మొల్ల జ్ఞాపకార్థం తపాలా బిళ్లనూ కూడ విడుదల చేసిందని గుర్తుచేశారు. ఆమె విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చిలుకూరి బాలు, చిట్టిబాబు నాయక్, కుమ్మరి సంఘం పట్టణ అధ్యక్షులు జమ్మిశెట్టి వేణుగోపాల్, కమిటీ సభ్యులు కామిశెట్టి రామ కృష్ణ, శ్రీనివాస్, నీలకంఠం భాస్కర్, చలికంటి రాములు, బాలకృష్ణ, శేఖర్ , ఎస్పీఆర్ స్కూల్ డైరెక్టర్ అయ్యన్న పుల్లారావు, నర్సింహ, బీసీ సంఘం నాయకులు, మిర్యాలగూడ, నాగార్జున సాగర్ నియోజకవర్గ కుమ్మరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

● నిడమనూరు : మండల కేంద్రంలో కుమ్మర సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శేషరాజు శ్రీనివాస్, కొమాండ్ల గుర్వయ్య, సలికంటి సత్యం, మాచర్ల దాసు, కామిశెట్టి శ్రీను, లక్ష్మీనరేష్, శేషరాజు దాసు, ఎలిజాల కాశయ్య వెంకన్నపాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : స్థానిక కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద ప్రముఖ తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి సైదులు, మాడ్గుల యాదగిరి, కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు తదితరులున్నారు.)



మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

## కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

కొండమల్లేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి సోమ , గురువారం నిర్వహించే కంటి పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటి వైద్య నిపుణులు కృష్ణమాచారి కోరారు. గురువారం పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు మందులను అందజేశారు.

## మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ సరికాదు

చింతపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన పేరుతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని సస్పెన్షన్ చేయడం సరికాదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతావత్ బిల్యానాయక్ పేర్కొన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి కారణాలు లేకుండా చర్చ నిర్వహిస్తుండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం భావ్యం కాదన్నారు. హామీలను విస్మరించి కేవలం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని ఆయన తెలిపారు.

## భగత్‌సింగ్ స్మారక యువ జనోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కొండమల్లేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భగత్‌సింగ్ స్మారక యువ జనోత్సవాల పోస్టర్‌ను గురువారం ఎస్ఎఫ్ఐ తెలంగాణ టెక్నికల్ రాష్ట్ర కో కన్వీనర్ రమావత్ లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి, మాదవ ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో చరణ్, శ్రీరాం, సాయిరాం, శరత్ తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

# నేటి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నిడమనూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పారం గ్రామంలో నిర్మించిన కనకదుర్గ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం నుంచి జరుగనున్నాయి. ప్రతిష్టాచార్యులు రాయప్రోలు శ్రీరామశర్మ, గుదె అనంతరామ శర్మ పర్యవేక్షణలో నేటి నుంచి ఆదివారం వరకు ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. 16న యంత్రపూజ, విగ్రహ ప్రతిష్ట, పూర్ణాహుతి నిర్వహించి మధ్యాహ్నం ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మూడు రోజులు దీక్షలు చేపట్టనున్నారు. ప్రతిష్ఠ ఉత్సవాలకు ఏర్పాట్లు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు




చింతపల్లి :గొడకొండ్ల(వీ.టి.నగర్)లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చింతపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గురువారం మండలంలోని గొడుకొండ్ల(వీ.టీ. నగర్)లో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్-హైదరాబాద్ రహదారి డివైడర్ మధ్యలో కేక్ కోస సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాదేపల్లి పులిరాజ్ గౌడ్, గొడుకొండ్ల గ్రామశాఖ అధ్యక్షుడు ఆకుతోట నరసింహ, జిట్ట జగన్, ఎండీ అజీమ్, బాదేపల్లి లాల్‌గౌడ్, రామకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ కవితకు అభినందన

మిర్యాలగూడ రూరల్ : ఎమ్మెల్సీ, కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఎల్‌పీ లాబీలో రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

## ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

## 'పది'లో నూరు శాతం ఫలితాలకు కృషి

నోముల యాదగిరి, ఎంఈఓ, గుర్రంపోడు



పదోతరగతి పరీక్షల్లో మండలంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తు న్నట్లు ఎంఈవో నోముల యాదగిరి తెలిపారు. ఈనెల 21 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' వివరాలు వెల్లడించారు .(గుర్రంపోడు-ఆంధ్రజ్యోతి)

**ఆంధ్రజ్యోతి** : పదో తరగతి పరీక్షకు ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారు?

**ఎంఈవో** : మండలంలో మొత్తం 10 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 280 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు

**ఆంధ్రజ్యోతి** : పరీక్షలకు ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు

**ఎంఈవో** : మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. జడ్పీ ఉన్న త పాఠశాలలో 120 మంది, మోడ ల్ స్కూల్‌లో 160 మంది విద్యార్థులు పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి** : నూరుశాతం ఉత్తీర్ణతకు ఏ విధంగా కృషి చేస్తున్నారు?

**ఎంఈవో** : నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తు న్నాం. ప్రస్తుతం ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి.

**ఆంధ్రజ్యోతి** : పరీక్షల నిర్వహణకు సిబ్బందిని నియమించారా?

**ఎంఈవో** పరీక్షల నిర్వహణకు ఇద్దరూ చీఫ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు డిపార్టమెంట్ అధికారులను నియమించాం. త్వరలో ఇన్విజిలేటర్లను కూడా నియమించబోతున్నాం.

## రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్ సౌకర్యం కల్పించాలి

డిండి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలోని పౌర సరఫరాల దుకాణంలో బయోమెట్రిక్ సౌకర్యం కల్పించాలని మాజీ సర్పంచ్ పొనుగోటి రవీందర్‌రావు గురువారం దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. బయోమెట్రిక్ నమోదు సౌకర్యం లేకపోవడం వల్ల రేషన్ తీసుకోవడంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ యన పేర్కొన్నారు. వలస వెళ్లిన కూలీలు రేషన్ పొందలేక పోతున్నారని, వారు ఆహార భద్రతకు దూరమవుతున్నారని అన్నారు. కొన్నేళ్లుగా గ్రామంలో సిగ్నల్స్‌లేవని సాకు చూపి బయోమెట్రిక్‌లో వివరాలు నమోదు చేయడంలేదని ఆయన పేర్కొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌కు చేరిన 10 పరీక్షా ప్రశ్న పత్రాలు

మిర్యాలగూడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ఈ నెల 21 జరగనుండడంతో ప్రశ్నపత్రాలు పోలీస్ స్టేషన్‌కు చేరాయి. గురువారం మండల విద్యాధికారి బాలునాయక్, పేపర్ కస్టోడియన్లు గుడిపాటి కోటయ్య, కందిమళ్ల కోటిరెడ్డి ఆధ్వర్యంలో సీఎస్‌డీవోల ఆధ్వ ర్యంలో మిర్యాలగూడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేసి లాకప్‌కు సీల్ వేశా రు. కాగా మిర్యాలగూడ పట్టణంలో 12 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. 2750 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల 200, బాలికల ఉన్నత పాఠశాల 200, సెంట్‌మేరీ 240, భారత్ స్కూల్ 150, చైతన్య స్కూల్ 200, బకల్‌వాడీ ఉన్నత పాఠశాల 200, ఎస్‌పీఆర్ స్కూల్ 280, కాకతీయ స్కూల్ 240, క్రిష్ణవేణి 240, అభ్యాస్ 280, శ్రీ చైతన్య 280, శివాని స్కూల్‌లో 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

## అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

వేములపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టలతో విద్యార్థి ఉద్యమాలను ఆప లేరని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల సంపత్ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీకి వెళ్లకుండా ముందస్తు అరెస్ట్ చేయడం పట్ల స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసి మాటాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా స్కాలర్‌షిప్, ఫీజు రీయిం బర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

తిరుమలగిరి(సాగర్), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్వాల గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. బాధితుడు మద్దిమడుగు భిక్షం తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని చెరువు సమీపంలోని పొలాల్లో మేత మేయడానికి భిక్షం చెందిన పాడిగేదె వెళ్లింది. ఈ క్రమంలో దాహం తీర్చుకునేందుకు సమీపంలోని చెరువు వద్దకు వెళ్తుండగా అక్కడే ఉన్న వైర్లు తగిలి విద్యు దాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

## పాఠశాలలో హోలీ వేడుకలు

నిడమనూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లిటిల్ ఏంజిల్స్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా ముందస్తు హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరిపై ఒకరు సహజ రంగులు చల్లుకుంటూ ఆనందంగా, సరదాగా సంబరాలు చేసుకున్నారు. రంగులు చల్లుకోవడంతో పాటు మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కందికట్ల ధన్వంతరిబాబు, సిబ్బంది ఉన్నారు.



హోలీ వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు

## చిట్టీల పేరుతో మోసం చేసిన తండ్రి, కొడుకుల రిమాండ్

గుర్రంపోడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : చిట్టీల పేరుతో కోట్లాది రూపా యలను అప్పుగా తీసుకొని మోసం చేసిన మండల కేంద్రానికి చెందిన గంగసాని అంజయ్య, అతడి కుమారుడు సతీష్‌ను గురువారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ మధు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన గంగసాని అంజయ్య కిరాణా వ్యాపారం నిర్వహిస్తూ చిట్టీల వ్యాపారం కూడా చేశాడు. పలువురి వద్ద అప్పుగా తీసుకొని కొంత కాలంగా చెల్లించడం లేదు. సుమారు 1.7 6కోట్లు అప్పు ఉన్నట్లు, 84 మందికి ఐపీ నోటీసులను ఈనెల 4న ఐపీ నోటీ సులు అందించారు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు గంగసాని అంజయ్య, సతీష్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఐపీ నోటీసుల్లో మార్చి 17న బాధితులు కోర్టుకు హాజరు కావాలని ఉంది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు రూ.15లక్షలు ఇవ్వాలి

కొండమల్లేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులోని సర్వే నెం.115లో గల ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.15లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ కాలనీలో ఇంటింటికి సీపీఎం పోరుబాటలో ఆయన మాట్లాడారు. సుమారు 24 ఏళ్లగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న ఎస్సీ ఇతరుల ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. అంబేద్కర్ కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. కావలి కృష్ణయ్య, ఆర్.సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.



అంబేద్కర్ కాలనీలో మాట్లాడుతున్న ఆనంద్